మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి
# ఈవార్తలు
దినపత్రిక
NETI EVARTHALU

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 15-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 | సంచిక: 166 Issue: 166

15 డిసెంబర్ 2025 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:42 సూర్యాస్తమయం - సా. 5:40 తిథిః ఏకాదశి రా. 9:20 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం చిత్తా ఉ. 11:03 వరకు తరువాత స్వాతి యోగం శోభన మ. 12:28 వరకు కరణం బవ ఉ. 8:03 వరకు భాలవ రా. 9:20 వరకు వర్జ్యం సా. 5:26 నుండి రా. 7:14 వరకు దుర్ముహూర్తం మ. 12:33 నుండి మ. 1:16 వరకు మ. 2:44 నుండి మ. 3:28 వరకు రాహుకాలం ఉ. 8:04 నుండి ఉ. 9:26 వరకు యమగండం ఉ. 10:48 నుండి మ. 12:11 వరకు గుళికాకాలం మ. 1:33 నుండి మ. 2:55 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:06 నుండి తె. 5:54 వరకు అమృత ఘడియలు తె. 4:09 నుండి తె. 5:57 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:33 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

# బీచ్‌లో రక్తపుటేర్లు

## ఆస్ట్రేలియా బాండీ బీచ్‌లో ఉగ్రవాదుల కాల్పులు

## 12 మంది మృతి, 29 మందికి తీవ్ర గాయాలు

ఆస్ట్రేలియాలోని సిడ్నీలో దారుణమైన ఉగ్రదాడి చోటుచేసుకుంది. ప్రఖ్యాత బాండీ బీచ్‌లో ఉగ్రవాదులు జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 29 మంది గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం యూదుల 'హనుక్కా' పండుగ వేడుకలు జరుగుతున్న ప్రదేశంలో ఈ దాడి జరిగింది. 'బాండీలో చోటుచేసుకున్న దృశ్యాలు దిగ్భ్రాంతికరంగా, కలచివేస్తున్నాయి.

సిడ్నీ: ప్రాణాలను కాపాడేందుకు పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది రంగంలోకి దిగి పనిచేస్తున్నారు. ఈ ఘటనలో ప్రభావితమైన ప్రతి ఒక్కరికీ నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. నేను ఇప్పుడే ఏఎఫ్‌పీ కమిషనర్‌తో, ఎన్ఎస్‌డబ్ల్యూ ప్రీమియర్‌తో మాట్లాడాను. మేము ఎన్ఎస్‌డబ్ల్యూ పోలీసులతో కలిసి పనిచేస్తున్నాము. మరింత సమాచారం ధ్రువీకరించుకున్న తర్వాత పూర్తి వివరాలు అందిస్తాము. పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్ఎస్‌డబ్ల్యూ పోలీసుల సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ అల్బనీస్ ట్వీట్ చేశారు. ఈ తరువాయి 2 వ పేజీలో...





## పాక్ చిత్తు


### మళ్లీ ఓడించిన టీమిండియా

### అండర్ 19 ఆసియా కప్

అండర్-19 ఆసియాకప్ 2025లో యువ భారత జట్టు జోరు కొనసాగుతోంది. ఈ టోర్నీలో భాగంగా ఆదివారం దాయాది పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 90 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు అద్భుతం చేశారు.

241 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని చేధించలేక పాక్ చతికల పడింది. భారత బౌలర్ల ధాటికి పాక్ అండర్ 19 జట్టు 41.2 ఓవర్లలో కేవలం 150 పరుగులకే కుప్పకూలింది. దీపేష్ -2 వ పేజీలో...

# 'హస్త'వాసిలో.. గులాబీ స్మైల్!




## రెండో విడత పంచాయతీలో కాంగ్రెస్ పైచేయి

## అధికారం లేకున్నా టఫ్ ఫైట్ ఇస్తున్న బీఆర్ఎస్

## పలు మేజర్ పంచాయతీల్లో కారు సపోర్టర్ల జోరు

తెలంగాణలో రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో హస్తం పార్టీ తన ఆధిక్యతను కొనసాగిస్తోంది. మొత్తం 4,332 స్థానాల్లో 2,243 స్థానాల్లో తన పార్టీ మద్దతుదారులను గెలిపించుకొన్నది. ఈ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాగింది.

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఈవార్తలు): ఈ విడతలో మొత్తం 85.76 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఇక జిల్లాల వారీగా చూస్తే.. యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 92 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే నిజామాబాద్ జిల్లాలో అయితే అతి తక్కువగా అంటే 76 శాతం పోలింగ్ నమోదైంది. అయితే, అధికారంలో లేకున్నా పలు కీలక స్థానాల్లో బీఆర్ఎస్ తరువాయి 2 వ పేజీలో...



## మన సత్తా ఒలింపిక్స్

### అంతర్జాతీయ ఆటలు నిర్వహించేస్థాయికి సీఈసీ

### మెస్సీ టూర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం

ఒలింపిక్స్ నిర్వహించే స్థాయి మనకు ఉందని, అంతటి సామర్థ్యాన్ని మనం ప్రపంచానికి చూపించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ద గోట్ ఇండియా టూర్‌లో భాగంగా ఫుట్‌బాల్ దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీ పర్యటనపై సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్‌లో ఆసక్తికర పోస్టు చేశారు.

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఈవార్తలు) : తమ ఆహ్వానాన్ని మన్నించి హైదరాబాద్ నగరాన్ని విచ్చేసి.. తమ క్రీడా ప్రియులకు ముఖ్యంగా యువతను ఉత్సాహపరిచినందుకు గోట్ లియోనెల్ మెస్సీకి, ఫుట్‌బాల్ దిగ్గజాలు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్‌లకు సీఎం రేవంత్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తమతో -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,391 |
| వెండి (గ్రాము): | రూ.210 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,071 |

# వస్తున్నారు.. కేసీఆర్!

## 19న బీఆర్ఎస్ కీలక సమావేశం

### ఝుకారు గేర్ మార్చనున్న గులాబీ బాస్... భేటీలో పలు కీలక నిర్ణయాలు

తెలంగాణ మాజీ సీఎం , బీఆర్ఎస్ అధినేత మళ్లీ రాజకీయంగా యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమవుతున్నట్టుగా తెలుస్తోంది. ఈ నెల 19న బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో జరిగే బీఆర్ఎస్ఎల్పీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సంయుక్త సమావేశానికి కేసీఆర్ అధ్యక్షత వహించనున్నారు.



హైదరాబాద్, డిసెంబర్ 14 (ఈవార్తలు): ఈ మేరకు బీఆర్ఎస్ వర్గాలు వివరాలు వెల్లడించాయి. అయితే కేసీఆర్ గత కొంతకాలంగా పార్టీ ముఖ్య నాయకులకు అందుబాటులో ఉండటంతో పాటు.. నియోజకవర్గాల వారీగా తనను కలిసేందుకు వచ్చిన కొందరు నేతలతో సమావేశమవుతున్నారు. అయితే తాజాగా ఇప్పుడు "కారు" గేర్ మార్చాలని కేసీఆర్ భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. కృష్ణా గోదావరి జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను, కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకుపోవడంలో చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి మీద చర్చించాలని కేసీఆర్ నిర్ణయించారని.. ఈ క్రమంలోనే తెలంగాణ భవన్‌లో ఈ నెల 19న బీఆర్ఎస్ఎల్పీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సంయుక్త సమావేశం ఏర్పాటు చేసిందని గులాబీ పార్టీ తరువాయి 2 వ పేజీలో...



## బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్

భారతీయ జనతా పార్టీ కొత్త జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిని ప్రకటించింది. బీహార్ మంత్రి నితిన్ నబిన్ పార్టీ కొత్త తాత్కాలిక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయన జెపి నడ్డా స్థానంలో పార్టీ కొత్త నాయకుడిగా నియమితులవుతారు.

న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విడుదల చేసిన లేఖలో, "భారతీయ జనతా పార్టీ పార్లమెంటరీ బోర్డు బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న నితిన్ నబిన్‌ను బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. నియామకం వెంటనే అమలులోకి వస్తుంది" అని పేర్కొన్నారు. బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నవీన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హృదయపూర్వకంగా అభినందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో ఒక పోస్ట్‌ను షేర్ చేస్తూ మోదీ.. "నితిన్ -2 వ పేజీలో...

## విశ్వవాణి



ఫిలిప్పీన్స్‌కు చెందిన ఓ విద్యార్థి.. తన గ్రాడ్యుయేషన్ డే రోజున తల్లి కటౌట్‌తో వేదికపై దర్శనమిచ్చాడు. కొడుకు డిగ్రీ పూర్తయిన సందర్భాన్ని చూడాలని కలలుగన్న ఆమె నిమోనియా సమస్యలతో చనిపోయింది. దీంతో తన తల్లి కోరిక మేరకు డిగ్రీ చేసిన పాలో జాన్ అలిన్ సాగ్.. డిగ్రీ పట్టాను తల్లి ఫొటోతో కలిసి అందుకున్నాడు.



## మూడ్రోజులు వణుకుడే!

### దారుణంగా పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఈవార్తలు): తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత నానాటికీ పెరిగిపోతుంది. తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్తర తరువాయి 2 వ పేజీలో...

## మెడ పట్టి గెంటేస్తా

### బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే గడప తొక్కనీయను

### అభివృద్ధి పనుల కోసం రావొద్దు: తూడి మేఘారెడ్డి



వనపర్తి, డిసెంబర్ 14 (ఈవార్తలు): ఓటర్లను ప్రలోభపెట్టడమే కాకుండా ఇప్పటికే పలువురు అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వార్నింగ్‌లు ఇవ్వగా.. తాజాగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కూడా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులకు ఓట్లు వేయొద్దని ప్రజలను బహిరంగంగా హెచ్చరించారు. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండల పరిధిలో జరగనున్న మూడో విడత పంచాయతీ ఎన్నికల ప్రచారంలో వనపర్తి ఎమ్మెల్యే తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

16.12.2025

మేషం: ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యమైన పనులలో జాప్యం కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. దూరప్రయాణాలు వీలైనంత వాయిదా వేయుట మంచిది. మీ ఆలోచనలు కుటుంబ సభ్యులకు నచ్చే విధంగా ఉండవు.

వృషభం: సంతాన ఉద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణప్రయత్నాలు చేయవలసి వస్తుంది. ప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి.

మిధునం: వ్యాపార ఉద్యోగాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. జీవిత భాగస్వామితో సఖ్యతగా వ్యవహరిస్తారు. నిరుద్యోగయత్నాలు సానుకూలమవుతాయి. భూ సంబంధిత క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. సమాజంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ పొందుతారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి.

కర్కాటకం: ధన వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ముఖ్యమైన పనులలో శ్రమకు తగిన ఫలితం కనిపిస్తుంది. వ్యాపార ఉద్యోగాలలో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. చేపట్టిన వ్యవహారాలు సజావుగా పూర్తి చేస్తారు. స్నేహితులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

సింహం: కుటుంబ సభ్యుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. దీర్ఘకాలిక రుణాలు ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో సొంత నిర్ణయాలు కలిసిరావు.

కన్య: ఉద్యోగస్తులకు అధికారుల నుండి సమస్యలు తప్పవు. ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ వాతావరణం గంధరగోళంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి.

తుల: నిరుద్యోగులకు నూతన ఉద్యోగయోగం ఉన్నది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో ఉన్న వివాదాలు పరిష్కారమవుతాయి. ఆత్మీయుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు.

వృశ్చికం: గృహమున కొన్ని సంఘటనలు ఆశ్చర్యం కలిగిస్తాయి. చిన్ననాటి మిత్రులతో మాట పట్టింపులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగస్తులకు ఇతరుల నుండి విమర్శలు తప్పవు. కుటుంబ విషయాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. దైవ సేవా కార్యక్రమాలకు ధనసహాయం అందిస్తారు.

ధనస్సు: విలువైన గృహెూపకరణాలు కొనుగోలు చేస్తారు. చాలా కాలంగా పూర్తికానీ పనులు చిన్న ప్రయత్నంతో పూర్తి చేస్తారు. రావలసిన సొమ్ము సకాలంలో చేతికందుతుంది. వ్యాపార ఉద్యోగాలలో అంచనాలు నిజమవుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాల్లో పాల్గొంటారు.

మకరం: సంతానం విద్యా విషయాలలో నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో ఊహించని మార్పులు తప్పవు. ఆర్థిక వ్యవహారాలలో అప్రమత్తంగా ఉండాలి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి.

కుంభం: చిన్ననాటి మిత్రులతో విందువినోదాలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సంతాన వివాహ విషయమై గృహమును ప్రస్తావన వస్తుంది. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

మీనం: చేపట్టిన పనులలో యత్న కార్యసిద్ధి కలుగుతుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలలో భాగస్తులు నుండి ఆశించిన సహాయం అందుతుంది. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగ్గా ఉంటుంది. స్నేహితులతో వివాదాలు పరిష్కారమవుతాయి.



# బీచ్‌లో రక్తపుటేర్లు

భయానక ఘటనలో ఓ సామాన్య పౌరుడు చూపిన అసమాన ధైర్యం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రాణాలకు తెగించి, ఓ ఉగ్రవాదిపైకి దూసుకెళ్లి అతని చేతిలోని షాట్‌గన్‌ను లాక్కున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఫుట్‌పాత్‌పై నిలబడి ఓ దుండగుడు కాల్పులు జరుపుతుండగా, సమీపంలో కారు వెనుక నక్కిన ఓ వ్యక్తి ఒక్కసారిగా అతనిపైకి దూకాడు. ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో ఉగ్రవాది చేతిలోని గన్‌ను లాక్కుని, అతడిని కిందపడేశాడు. ఆ గన్‌ను దుండగుడికి ఎక్కుపెట్టడంతో అతను వెనక్కి తగ్గాడు. అనంతరం ఆ వ్యక్తి తుపాకీని ఓ చెట్టుకు ఆనించి, తాను దుండగుడ్ని కాదు అని పోలీసులు గుర్తించేలా శాంతియుతంగా చేతులు పైకెత్తాడు.

## ఉగ్రవాద చర్యే: అల్బనీస్

దీనిని ఉగ్రవాద చర్యగా అధికారులు ప్రకటించారు. ఈ దాడిని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ తీవ్రంగా ఖండించారు. "యూదుల పండుగ రోజున వారిని లక్ష్యంగా చేసుకుని చేసిన క్రూరమైన దాడి ఇది. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి ఇతరులను కాపాడిన సామాన్యులు నిజమైన హీరోలు. వారి ధైర్యం ఎన్నో ప్రాణాలను నిలబెట్టింది" అని ఆయన అన్నారు. ఈ దాడిలో ఇద్దరు దుండగులు పాల్గొన్నట్లు పోలీసులు నిర్ధారించారు. వారిలో ఒకరిని కాల్చి చంపగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మూడో వ్యక్తి ప్రమేయంపైనా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనపై న్యూ సౌత్ వేల్స్ ప్రీమియర్ క్రిస్ మిన్స్ స్పందిస్తూ, "ఈ విషాదంలో కూడా అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించే సామాన్యులు మన మధ్య ఉన్నారనడానికి ఇదే నిదర్శనం" అని పేర్కొన్నారు.



# 'హస్త'వాసిలో..

మొదటి పేజీ తరువాయి

తన మార్కును చూపెట్టింది. కేటీఆర్, హరీశ్ రావు సొంత నియోజకవర్గాలైన సిరిసిల్ల, సిద్దిపేటలో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో 415 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 3,911 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు అధికారులు.

## మా పనితీరుకు నిదర్శనం: మహేశ్ కుమార్ గౌడ్

ఇక పంచాయతీ ఎన్నికల ఫలితాలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పంచాయతీ ఎన్నికలు రెండో విడతలోనూ అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులే గెలిచారని అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు సమిష్టిగా కష్టపడ్డారని తెలిపారు. గ్రామీణ ఓటర్లు ప్రభుత్వ పాలనపై నమ్మకం ఉంచారని అన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసే దిశగా సర్కారు ముందుకు సాగుతోందని అన్నారు.

## పార్టీలవారీగా ఫలితాలివీ..

కాంగ్రెస్ - 2243, బీఆర్ఎస్ - 1188

బీజేపీ - 268, ఇతరులు - 624

# మెడ పట్టి గెంటేస్తా

మొదటి పేజీ తరువాయి

తూడి మేఘా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను చెప్పినోళ్లను కాకుండా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే వారిని నా క్యాంప్ ఆఫీసులోకి రాకుండా మెడ పట్టి గెంటేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ తరఫున ఒక్క వార్డు మెంబర్ గెలిచినా కూడా అభివృద్ధి పనుల కోసం నా దగ్గరికే రావాలని.. అప్పుడు వారిని తన క్యాంప్ ఆఫీసు నుంచి బయటకు మెడపట్టి గెంటేస్తానని హెచ్చరించారు. మీ గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని కూడా చేయనని వార్నింగ్ ఇచ్చారు. మేఘా రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి.

# బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్

మొదటి పేజీ తరువాయి

నవీన్ కష్టపడి పనిచేసే బీజేపీ కార్యకర్తగా తనను తాను నిరూపించుకున్నారు. ఆయన యువ, అంకితభావంతో పనిచేసే నాయకుడు, సంస్థాగత అనుభవం సంపద కలిగిన వ్యక్తి, బీహార్‌లో ఎమ్మెల్యేగా, మంత్రిగా అనేక పర్యాయాలు అద్భుతమైన రికార్డును సొంతం చేసుకున్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఆయన పూర్తి విధేయత, అంకితభావంతో పనిచేశారు." అని పేర్కొన్నారు. ఆయన వినయపూర్వకమైన స్వభావానికి, నిక్కచ్చిగా పనిచేసే తత్వానికి నిదర్శనం. రాబోయే సంవత్సరాల్లో ఆయన శక్తి, నిబద్ధత మన పార్టీని మరింత బలోపేతం చేస్తాయని విశ్వసిస్తున్నాను. భారతీయ జనతా పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అయినందుకు ఆయనకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు" అని ప్రధాని అన్నారు.

# పాక్ చిత్తు

మొదటి పేజీ తరువాయి

దేవేంద్రన్, కన్షిక్ చౌహాన్ తలా మూడు వికెట్లతో పాక్ పతనాన్ని శాసించారు. వీరితో పాటు కిషాన్ కుమార్ రెండు వికెట్లు సాధించారు. పేసర్ దీపేష్ పవర్‌ప్లేలోనే మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని దెబ్బతీశాడు. పాక్ బ్యాటర్లలో హుజైఫా అహ్సన్(83 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సలతో 70) ఒంటరి పోరాటం చేశాడు. ఓ వైపు వికెట్లు పడతున్నప్పటికి అహ్సన్ మాత్రం దూకుడుగా ఆడి భారత్‌పై ఒత్తిడిపెంచాడు. ఈ క్రమంలో వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన క్యాచ్‌తో పెవిలియన్‌కు పంపాడు. పాక్ ఇన్నింగ్స్‌లో ముగ్గురే ముగ్గురు డబుల్ డిజిట్ స్కోర్ సాధించారు. ఇక అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. భారత బ్యాటర్లలో భారత బ్యాటర్లలో ఆరోన్ జార్జ్(85) టాప్ స్కోరర్‌గా నిలవగా.. కనిష్క్ చౌహాన్(46), మాత్రే(38) రాణించారు. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ(5) విఫలమయ్యాడు. పాక్ బౌలర్లలో మహ్మద్ సయ్యామ్, అబ్దుల్ సుభాన్ తలా మూడు వికెట్లు పడగొట్టారు.



# వస్తున్నారు.. కేసీఆర్!

మొదటి పేజీ తరువాయి

వర్గాలు తెలిపాయి. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గోదావరి కృష్ణ జలాలను కొల్లగొడుతున్నా కూడా, దానిని అడ్డుకునే విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇటువంటి సందర్భంలో.. తెలంగాణ ప్రజల రైతాంగ సాగునీటి హక్కులను కాపాడుకోవడానికి మరో ప్రజా ఉద్యమం తప్పదని భావిస్తున్నాం. ఇందులో భాగంగాతదుపరి నిర్మించబోయే తెలంగాణ ప్రజా ఉద్యమాలకు సంబంధించి పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో లోతుగా చర్చ జరగనుంది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 90 టీఎంసీలు కేటాయిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వము ఇప్పుడు కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలు అని కేంద్రం ముందు దేబరించడం బాధాకరం. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి 45 టీఎంసీలకు అంగీకరిస్తూ కేంద్రం వద్ద మోకరిల్లి రావడం రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే. ఫస్ట్ ఫేస్‌లో కొనసాగుతున్న పాలమూరు ఎత్తిపోతల పథకం సెకండ్ ఫేస్ ఎట్లా పూర్తయితదో చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేయడమే. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యంగా పాలమూరు రంగారెడ్డి నల్లగొండ ప్రజల రైతాంగ ప్రయోజనాలు దెబ్బతింటున్న నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా ఒక్కరూ మాట్లాడిన పాపాన పోవట్లేదు. ఇంకా చెప్పాలంటే.. బీజేపీయే తెలంగాణ ప్రయోజనాలకు రైతాంగ ప్రయోజనాలకు గండి కొడుతున్నదనేది స్పష్టమవుతుంది. తెలంగాణ రాష్ట్రానికి సాగునీటి విషయంలో కేంద్ర బీజేపీ చేస్తున్న అన్యాయాన్ని కానీ, కావేరి తదితర నదుల అనుసంధానం పేరుతో ఆంధ్ర రాష్ట్ర జలదోపిడికి సహకరిస్తున్న కేంద్ర బీజేపీ విధానాన్ని గాని ఎదుర్కోవాలంటే.. తెలంగాణ సమాజం మరొకసారి ప్రత్యక్ష పోరాటాలే శరణ్యం అని పార్టీ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు' అని బీఆర్ఎస్ పార్టీ వర్గాలు తెలిపాయి. 'బీఆర్ఎస్ ప్రభుత్వమే గనక తిరిగి అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి నీళ్లు అందేవి.. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రజల, రైతాంగ ప్రయోజనాలు కాపాడబడేవి. కానీ ఇప్పుడు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వము, పాలమూరు రంగారెడ్డి నల్గొండ ప్రజల ప్రయోజనాల పట్ల పూర్తి నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించడం, పనులు చేయలేకపోవడం వల్ల ఆ ప్రాంత ప్రజలు రైతాంగము తీవ్రంగా నష్టపోతున్నారు. రెండేళ్లు గడిచినా కూడా, తెలంగాణ రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇంకా తెలంగాణ సమాజం మౌనం వహించజాలదు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు, కృష్ణా జలాలలో కేవలం 45 టీఎంసీలు ఒప్పుకోవడం అనేది ఘోరాతి ఘోరం, దుర్మార్గం. అందుకే సాగునీరు తెలంగాణ రైతాంగ ప్రయోజనాలను కాపాడే విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నటికీ రాజీపడబోదు. అందుకే ఈనెల 19న నాడు నిర్వహించబోయే విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ అధ్యక్షతను విస్తత స్థాయి చర్చ జరగనుంది' అని వెల్లడించాయి. ఈ సమస్యలకు అనుగుణంగా చేపట్టబోయే ప్రజా ఉద్యమాలను నిర్మాణము, అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు ఉంటాయని కూడా పేర్కొన్నాయి.



# మన సత్తా ఒలింపిక్స్

మొదటి పేజీ తరువాయి

చేరి ఆ సాయంత్రాన్ని జీవితకాల జ్ఞాపకంగా మార్చినందుకు తమ నాయకుడు రాహుల్ గాంధీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టుగా చెప్పారు. తెలంగాణ అంటే క్రీడలు, తెలంగాణ అంటే ఎక్సలెన్స్, తెలంగాణ అంటే ఆతిథ్యం అని ప్రపంచానికి చాటిచెప్పడంలో కీలక పాత్ర పోషించిన నగరంలోని అందరూ అధికారులు, భద్రతా సిబ్బంది, నిర్వాహకులు, సిబ్బందికి కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. అలాగే క్రమశిక్షణతో వ్యవహరించినందుకు క్రీడా ప్రేమికులకు, అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశారు. 'క్రీడా ప్రపంచంలో తెలంగాణ ముద్ర... ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం గోట్ మెస్సీతో హైదరాబాద్ గడ్డపై సాధించిన అద్భుతమైన ఘనత. ప్రపంచ క్రీడా వేదికపై తెలంగాణ ప్రకాశించిన సందర్భం ఇది... భవిష్యత్తులో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చే సామర్థ్యం తెలంగాణకు ఉందని చాటిచెప్పాం" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మెస్సీ పర్యటనకు సంబంధించిన వీడియోను కూడా షేర్ చేశారు.



## టీబీబీపీఎస్ఏ చైర్మన్‌గా
# కేసిడి సంపత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఈవార్తలు): తెలంగాణ బాడీ బిల్డర్స్ ఫిజిక్ స్పోర్ట్స్ అసోసియేషన్ (టీబీబీపీఎస్ఏ) చైర్మన్ అండ్ చీఫ్ పాట్రాన్‌గా కేసిడి సంపత్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు టీబీబీపీఎస్ఏ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్‌కు అనుబంధంగా ఉన్న ఈ అసోసియేషన్.. తెలంగాణలో సంబంధిత కార్యకలాపాలకు బాధ్యత వహిస్తుంది. రాష్ట్రంలో బాడీ బిల్డింగ్, ఫిజిక్ కాంపిటీషన్స్ నిర్వహిస్తుంది. జాతీయ, అంతర్జాతీయ పోటీలకు అథ్లెట్లను ఎంపిక చేస్తుంది.



# పోలింగ్‌కు ముందే అభ్యర్థి, ఓటేశాక ఓటరు మరణం!

ఖమ్మం, డిసెంబర్ 14 (ఈవార్తలు): తెలంగాణలో ఆదివారం జరిగిన రెండో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్‌లో పలు విషాద, వింత ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ ప్రారంభానికి కొద్ది నిమిషాల ముందు ఓ సర్పంచ్ అభ్యర్థి మరణించగా, మరోచోట ఓటు వేసిన వెంటనే ఓ వృద్ధుడు కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. వివరాల్లోకి వెళితే, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అనసాగర్ గ్రామంలో సర్పంచ్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న డి. నాగరాజు, పోలింగ్‌కు ముందు మృతి చెందారు. ఎన్నికల ప్రచారంతో తీవ్ర ఒత్తిడికి గురైన ఆయన, శనివారం రాత్రి అస్వస్థతకు గురయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం కన్నుమూశారు. ఇదే తరహాలో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో మరో విషాదం జరిగింది. పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి బయటకు వచ్చిన సోలిపేట బుచ్చయ్య (70) అనే వృద్ధుడు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించినా, అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుని కుమార్తె రాములమ్మ వెంకన్నగూడ గ్రామంలో వార్డు సభ్యురాలిగా పోటీలో ఉన్నారు. కాగా, ఆదివారం జరిగిన రెండో విడత పోలింగ్‌లో 193 మండలాల పరిధిలో 3,911 సర్పంచ్, 29,917 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 57.22 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# నన్ను చూసుకునే నాకు పొగరు

**'అఖండ 2' వేడుకలో బాలకృష్ణ వ్యాఖ్యలు**

**హైదరాబాద్‌లో అఖండ-2 విజయోత్సవ సభ**

**చరిత్రను తిరగరాసి తిరిగి చరిత్ర సృష్టించే వాడు ఒక్కడే అంటూ పవర్ ఫుల్ స్పీచ్**



హైదరాబాద్, డిసెంబర్ 14 (ఈవార్తలు): నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' (అఖండ భారత్) చిత్రం ఘన విజయం సాధించిన సందర్భంగా హైదరాబాద్‌లో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆకర్షణగా నిలిచిన బాలకృష్ణ, తన ప్రసంగంతో అభిమానుల్లో ఉత్సాహం నింపారు. సినిమా, సమాజం, సనాతన ధర్మం, తన వ్యక్తిత్వంపై ఆయన చేసిన వ్యాఖ్యలు హైలైట్‌గా నిలిచాయి. ఈ సినిమాతో 'సనాతన హైందవ ధర్మం మీసం మెలేసింది' అని ప్రేక్షకులు అంటున్నారని బాలకృష్ణ అన్నారు. "మంత్రోచ్చారణ, వేదం, మన భారత దేశపు మూలాలు, మన ధర్మం, మన గర్వాన్ని కలగలిపిన సినిమా ఇది. ఇందులోని ప్రతి డైలాగ్ ఓ ఆణిముత్యం" అని కొనియాడారు. "ప్రకృతి, పిల్లల జోలికొస్తే దేవుడు ఏం చేస్తాడో 'అఖండ'లో చూపాం. అదే మనిషి దేవుడైతే ఎలా ఉంటుందో 'అఖండ 2'లో చూపించాం" అని చిత్ర కథాంశాన్ని వివరించారు. తన పొగరు గురించి తరచూ వచ్చే విమర్శలపై బాలకృష్ణ తనదైన శైలిలో స్పందించారు. "ఎవరిని చూసుకుని బాలకృష్ణకు అంత పొగరు అంటారు? నన్ను చూసుకునే నాకు పదునైన పొగరు ఉంది. నా వ్యక్తిత్వమే నన్ను ఉసిగొలిపే విప్లవం. నన్ను నేను తెలుసుకోవడమే నాకు తెలిసిన గొప్ప విద్య" అని అన్నారు. సినిమా తనకు ఉత్సాహాన్ని ఇస్తుందని, తన వృత్తే తనకు దైవమని బాలకృష్ణ తెలిపారు. "చరిత్రలో చాలా మంది ఉంటారు. కానీ సృష్టించిన చరిత్రను మళ్లీ మళ్లీ తిరగరాసి, తిరిగి చరిత్ర సృష్టించే వాడు ఒక్కడే. అదొక తెలియని శక్తి" అని వ్యాఖ్యానించారు. ఇది కేవలం తెలుగు సినిమా కాదని, ప్రపంచ సినిమా అని అభివర్ణించారు. చివరగా, ఈ భారీ విజయానికి కారణమైన చిత్ర బృందానికి, ప్రేక్షక దేవుళ్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# హరీశ్‌తో కేసీఆర్‌కు ముప్పు

**జాగ్రత్తగా ఉండాలి: టీపీసీసీ చీఫ్**

**ఏ క్షణంలోనైనా హరీశ్ వెన్నుపోటు పొడుస్తారని హెచ్చరిక**



న్యూఢిల్లీ: మాజీ మంత్రి హరీశ్‌రావు విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చాలా జాగ్రత్తగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్‌రావు ఏ క్షణంలోనైనా కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచే ప్రమాదం ఉందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి కావాలనే ఆశ ఎవరికైనా ఉంటుందని హరీశ్‌ను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. ఈరోజు ఢిల్లీ పర్యటనలో ఉన్న మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్తు ఉంటే కవిత ఎందుకు బయటకు వస్తారని ప్రశ్నించారు. మాజీ మంత్రి కేటీఆర్ తనకున్న డబ్బుతో సోషల్ మీడియాను మ్యానేజ్ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ అధికారంలోకి రాలేదని, వారు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, పార్టీ వ్యవహారాలపైనా మహేశ్ గౌడ్ స్పందించారు. కేబినెట్ ప్రక్షాళనపై కసరత్తు జరుగుతోందని, తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవిపై ఆసక్తి లేదని, టీపీసీసీ అధ్యక్షుడిగానే ఎంతో సంతోషంగా ఉన్నానని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ అభివృద్ధిపై స్పష్టమైన విజన్ ఉందని, హైదరాబాద్‌ను ప్రపంచంలోనే ఉత్తమ నగరంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, రాబోయే ఏ ఎన్నికల్లోనైనా కాంగ్రెస్ సునాయాసంగా గెలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# పంచాయతీకే భయపడుతున్నారు!

**కాంగ్రెస్‌పై కేటీఆర్ సెటైర్లు**



హైదరాబాద్, డిసెంబర్ 14 (ఈవార్తలు): కేవలం సర్పంచ్, పంచాయతీ ఎన్నికలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతగా భయపడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. రెండేళ్లలో అద్భుతాలు చేశామని, రుణమాఫీ, ఇళ్లు, రేషన్ కార్డులు ఇచ్చామని కాంగ్రెస్ చెబుతున్న మాటలు నిజమే అయితే, ఎన్నికలంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన 420 హామీలు అమలు చేసి ఉంటే ప్రజలే బ్రహ్మరథం పట్టేవారని, కానీ వైఫల్యాల భయంతోనే కాంగ్రెస్ నేతలు దాడులకు, దౌర్జన్యాలకు తెగబడుతున్నారని మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం లింగంపల్లి గ్రామంలో కాంగ్రెస్ గూండాల చేతిలో దారుణ హత్యకు గురైన బీఆర్ఎస్ కార్యకర్త ఉప్పల మల్లయ్య కుటుంబాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇవాళ పరామర్శించారు. మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని కేటీఆర్ అందజేశారు. పార్టీ ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. "పదేళ్లు మేము అధికారంలో ఉన్నాం.. ఏనాడూ మీలాగా ఆలోచించలేదు. మేము కూడా మీలాగే ఆలోచించి ఉంటే ఈరోజు కాంగ్రెస్ కార్యకర్తలకు ఈ పరిస్థితి ఉండేదా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, కాంగ్రెస్ నేతలు ఇప్పటికైనా దిక్కుమాలిన రాజకీయాలు మాని, ప్రజలకు మంచి చేయడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

కాంగ్రెస్ గుండాల్లారా జాగ్రత్త అని కేటీఆర్ పిలుపునిచ్చారు. తమ సహనాన్ని పరీక్షించవద్దని సూచించారు. కాంగ్రెస్ గుండాల్లారా తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మల్లయ్య కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుతంత్రాలు చేసినా, ఇవాళ రాష్ట్రంలో 50 శాతం సర్పంచ్‌లను గెలుచుకున్నామని తెలిపారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ ఎదురుచూస్తున్నారని అన్నారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

# భారీగా పట్టుబడ్డ మందుబాబులు

**హైదరాబాద్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్**

**పట్టుబడిన 850 మందికి పైగా వాహనదారులు**

**హైదరాబాద్‌లో 460, సైబరాబాద్‌లో 407 కేసులు నమోదు**

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వీకెండ్ లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 850 మందికి పైగా పట్టుబడినట్లు ఆదివారం పోలీసులు వెల్లడించారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ తనిఖీలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 12, 13 తేదీల్లో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 460 మందిని పట్టుకున్నారు. వీరిలో 350 మంది ద్విచక్ర వాహనదారులు, 25 మంది ఆటో డ్రైవర్లు, 85 మంది కార్ల డ్రైవర్లు ఉన్నారు. ఇక సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రైవ్‌లో 407 మంది పట్టుబడ్డారు. వీరిలో 290 మంది ద్విచక్ర వాహనదారులు, 90 మంది కార్ డ్రైవర్లు, 18 మంది ఆటో డ్రైవర్లు, 9 మంది భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. డ్రంక్ డ్రైవింగ్ విషయంలో ఏమాత్రం సహించేది లేదని, ఈ ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. గత వారం (డిసెంబర్ 8–13) సైబరాబాద్ పరిధిలో 385 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు విచారించగా... 16 మందికి జైలు శిక్ష, జరిమానా విధించాయి. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే, భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని సైబరాబాద్ పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు. ఈ సెక్షన్ కింద గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు.



## హరీశ్ కాదు..
# వైఎస్సార్ వల్లే

**పార్టీ మార్పుపై జగ్గారెడ్డి క్లారిటీ**

సంగారెడ్డి, డిసెంబర్ 14 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి మండిపడ్డారు. జగ్గారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో నుంచి బయటకు రావడానికి హరీశ్‌రావు కారణమని చేసిన ఆరోపణలను ఖండించారు. కవిత చేసిన ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు. తాను హరీశ్‌రావుపై కోపంతో కాంగ్రెస్‌లోకి రాలేదని తెలిపారు. తాను బీఆర్ఎస్ వీడటానికి హరీశ్‌రావు కారణం కాదని పేర్కొన్నారు. కేసీఆర్ కుమార్తె స్టేట్‌మెంట్ రాంగ్ అని అన్నారు. కేసీఆర్ కూతురు కాబట్టే కవిత లీడర్ అయ్యారు.. అందుకే ఆమెను కేసీఆర్ కుమార్తె అంటున్నా అని వివరించారు. తాను కాంగ్రెస్‌లోకి రావడానికి వైఎస్ఆర్ కారణమని జగ్గారెడ్డి తెలిపారు. తన పనితీరు నచ్చి కాంగ్రెస్‌లోకి రావాలని వైఎస్ఆర్ పిలిచారని చెప్పారు. తన మీద సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా కవిత తనపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. నేను కొంత డిస్టర్బ్ అయ్యానని జగ్గారెడ్డి తెలిపారు. అందుకే ఎవరి ఫొటోలు వద్దు.. రాహుల్ గాంధీ ఫొటో ఒక్కటే పెట్టాలని చెప్పానని పేర్కొన్నారు. అన్నీ ఇప్పుడే చెప్పను.. సమయం వచ్చినప్పుడు చెప్తానని అన్నారు. ఎవరి వల్ల డిస్టర్బ్ అయ్యానేది మే నెలలో చెబుతానని ప్రకటించారు. నేను డిసైడ్ అయ్యాక వెనక్కి రాను, ముందుకెళ్తా అని స్పష్టం చేశారు. ప్రచార కమిటీ చైర్మన్ పదవిపై కూడా ఆసక్తి లేదని స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యే సొంతూరిలో పటాకుల మోత

**మధుసూదన్ రెడ్డి స్వగ్రామంలో బీఆర్ఎస్ గెలుపు**

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఈవార్తలు): మహబూబ్‌నగర్ జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఓటర్లు షాకిచ్చారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి స్వగ్రామం చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఘన విజయం సాధించారు. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలనే ఉద్దేశ్యంతో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి వర్గం విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంచారు. వినని వాళ్లను బెదిరింపులు, భయభ్రాంతులకు గురిచేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ నాయకుల ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్న గ్రామస్తులు.. బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించారు. దీంతో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పావని కృష్ణయ్య శెట్టి 110 ఓట్ల తేడాతో గెలుపొందారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి స్వగ్రామం చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఘన విజయం సాధించారు

# ఆర్టీసీ ప్రైవేటీకరణకు కుట్ర: కవిత



హైదరాబాద్, డిసెంబర్ 14 (ఈవార్తలు): తెలంగాణలో ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత హైదరాబాద్‌లో బస్సుల సంఖ్యను 7500 నుంచి 3500కు తగ్గించారని కవిత ఆరోపించారు. కోటి మందికి పైగా జనాభా ఉన్న నగరంలో బస్సులు తగ్గించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన ప్రజా రవాణా వ్యవస్థ లేకుండా హైదరాబాద్‌ను విశ్వనగరంగా ఎలా అభివృద్ధి చేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అక్టోబర్ 25 నుంచి 'జనంబాట' పేరుతో తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు కవిత వెల్లడించారు. పంచాయతీ ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఈ పర్యటనలో అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో వీధికుక్కల బెడద ఎక్కువైందని, పారిశుద్ధ్య కార్మికుల కొరతతో చెత్త పేరుకుపోతోందని కవిత అన్నారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనులతో పాటు, అంబర్‌పేట–ముషీరాబాద్ బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. నగర ప్రజలకు కొండపోచమ్మ సాగర్ నుంచి తాగునీరు అందించాలని, పట్టణ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆమె కోరారు.

# సోషల్ వాణి




## మౌనంగా ఉండటమంటే అన్యాయానికి వత్తాసు పలకటమే....!!

నిస్వార్థంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రజలెవ్వరూ తమకు పదవులు కావాలని కోరలేదు.అమరులైనవాళ్లూ పైసా స్వార్థం కోరి ప్రాణాలివ్వలేదు. ఎవరికి తోచిన రీతిలో వాళ్ళు ఉద్యమాన్ని భుజాన మోసారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ప్రజలు తిరిగి తమ బ్రతుకు పోరాటంలో పడిపోయారు. అలాగే ఏదీ ఆశించకుండా ఉద్యమంలో పాల్గొన్న కొందరు మేధావులు,విద్యార్థులు,కళాకారులు తమ దైనందిన జీవితంలో నిమగ్నమయ్యారు..వారు ఎవరి దగ్గరా సాగిలపడలేదు,ఏ పదవులూ తీసుకోలేదు.

కానీ తెలంగాణ ఏర్పడ్డాక కొందరికి ఆయాచితంగా పదవులొచ్చాయి, కొందరు అడుక్కొని కూడా పదవులు తెచ్చుకున్నారు, కొందరు నిజంగానే తెలంగాణా పునర్నిర్మాణం తమ బాధ్యత అని పదవులు చేపట్టారు..ఇందులో ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ఇక్కడి ప్రభుత్వాలు తెలంగాణ సోయితో వ్యవహరించనప్పుడు, అమరుల ఆశయాలకు విరుద్ధమైన నిర్ణయాలు తీసుకుంటున్నప్పుడు 'కొందరు' చిన్న చిన్న పదవులకే పెదవులు మూసుకోవటం బాధాకరం (పసునూరి రవీందర్ ను మినహాయించి)..

ఇక కోదండరాం గారితో సహా కొందరు పెద్దలైతే అసలు ప్రభుత్వాలు ఏంచేసినా మాట్లాడకూడదు అని భావించటం దురదృష్టకరం. మనం కొట్లాడింది మన ఆత్మగౌరవం,అస్తిత్వం, అన్ని రంగాల్లో దోపిడీ నుంచి విముక్తి కోసం. కానీ జరుగుతున్న పరిణామాలు చూస్తే భౌగోళికంగా విడిపోయాం చాలు, అస్తిత్వ స్పృహ అక్కర్లేదన్నట్టుగా ఉంది వీళ్ళ ధోరణి.

అందరికీ కుటుంబాలు ఉన్నాయి,అందరికీ వారిదైన జీవితం ఉంది.అందరూ పదవుల వల్లే బ్రతకటం లేదు. మరి ప్రభుత్వాలు విసిరే పదవులకోసం వీరు తమ ఆత్మగౌరవాన్ని ఎందుకు తాకట్టు పెడుతున్నారో సగటు ఉద్యమకారులకు అర్థం కావటం లేదు.తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలు,పదవుల్లో ఉన్నా నిర్భయంగా మాట్లాడినవాళ్ళు ఇప్పుడెందుకు నోళ్లు మూసుకున్నారో సామాన్య తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాల్సిన అవసరం ఉంది...

**ఎందరో తెలంగాణ మహనీయులు, అమరవీరులకు దక్కాల్సిన గౌరవం తెలంగాణ అస్థిత్వాన్ని గుర్తించ నిరాకరించిన ఒక వృత్తి గాయకుడికి దక్కుతుంటే వీళ్ళలో కాస్తయినా చలనం రాకపోవటం ఆశ్చర్యం కలిగిస్తున్నది...ఏమైంది వీళ్లకు ?**

పన్నెండేళ్ళకే ఉద్యమ వేడి పలుచబడిందా ??
లేక అసలు ముఖం ఇదేనా ?
ఇక్కడ పేర్కొన్నవాళ్ళే కాదు...
ఉద్యమకారులు అందరూ ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోండి...
రవీంద్రభారతిలో బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించండి.ప్రభుత్వాన్ని నిలదీయండి...!
తెలంగాణ అన్నీ గుర్తుంచుకుంటుంది !!
( విమలక్క, గాదె ఇన్నయ్య, సంధ్య,
బి.నర్సింగరావు గార్లకు వినయపూర్వక విజ్ఞప్తి...
విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించినవాళ్లకు ధన్యవాదాలు)

– ప్రేమ్‌రాజు ఎనుముల, సినిమా దర్శకుడు


# నరరూప రాక్షసులకు జగన్ అండ

**పిన్నెల్లి సోదరులపై జూలకంటి సంచలన వ్యాఖ్యలు**

మాచర్ల, డిసెంబర్ 14 (ఈవార్తలు): పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వంటి నరరూప రాక్షసులకు వైసీపీ అధినేత జగన్ మద్దతు ఇస్తున్నారంటూ మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కోర్టు ఆదేశాల మేరకు పిన్నెల్లి అరెస్ట్ అయితే, దానిని అక్రమ నిర్బంధమని వైసీపీ నేతలు ఆరోపించడం సిగ్గుచేటని మండిపడ్డారు. మాచర్లలో నెలకొన్న పరిస్థితులపై ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "ఒక నరహంతకుడు జైలుకు వెళితే మాచర్ల ప్రజలు మళ్లీ దీపావళి సంబరాలు చేసుకుంటున్నారు. ప్రజలు ఆనందంగా ఉండటాన్ని చూసి ఓర్వలేక, రాజకీయ కక్ష సాధింపు అంటూ వైసీపీ డ్రామాలకు తెరలేపింది. అధికార మదంతో చేసిన నేరాలు, ఘోరాలు శాపాలుగా వెంటాడుతుంటే, అక్రమ కేసులని సానుభూతి కోసం టాపిక్ డైవర్షన్ రాజకీయాలు చేయడం వైసీపీకే చెల్లుతుంది" అని బ్రహ్మానందరెడ్డి ఎద్దేవా చేశారు. పిన్నెల్లి సోదరులు చేసిన దాడులు, దౌర్జన్యాలు, హత్యలను ప్రజలు కళ్లారా చూశారని ఆయన అన్నారు. "తురకా కిశోర్ వంటి రాక్షసులను తయారు



చేసి ప్రజల మీదకు వదిలి, వారి ఆర్తనాదాల మధ్య జగన్‌తో కలిసి సైకో ఆనందం పొందారు. 'జై జగన్' అనలేదని తోట చంద్రయ్యను గొంతు కోసి చంపారు. జల్లయ్యను పొట్టన పెట్టుకున్నారు. బడుగు, బలహీన వర్గాలను హింసించి, హతమార్చి ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేశారు. వాళ్లు మనుషులు కాదా? నరహంతకులను వెనకేసుకొస్తున్న జగన్‌కు కనీసం మానవత్వం ఉందా?" అని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. ఒక హంతకుడి పాపం పండి కోర్టు ఆదేశాలతో అరెస్ట్ అయితే, దానిని అక్రమ నిర్బంధం అనడానికి వైసీపీ నేతలకు సిగ్గుండాలని అన్నారు. వైసీపీకి న్యాయస్థానాలంటే లెక్కలేదని, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం లేదని ఈ వ్యాఖ్యలతోనే అర్థమవుతోందని విమర్శించారు. జగన్ లాంటి సైకో మనస్తత్వం ఉన్న నాయకులు రాష్ట్రంలో ఉండటం అత్యంత ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. గత ఐదేళ్లలో మాచర్ల నియోజకవర్గాన్ని రావణకాష్ఠంలా మార్చారని, తాలిబన్ల మాదిరి ప్రజలపై దమనకాండ సాగించారని ఆరోపించారు. జగన్ అండతోనే వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని పిన్నెల్లి సోదరులు పేట్రేగిపోయారని, మాచర్లలో వారి రాజ్యాంగమే అమలైందని దుయ్యబట్టారు. అక్రమ వ్యాపారాలు, భూదందాలు, గనుల తవ్వకాలతో పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడ్డారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోకి చొరబడి ఈవీఎంలను ధ్వంసం చేయడం, విధి నిర్వహణలో ఉన్న సీఐపై హత్యాయత్నం చేయడం వంటి చర్యలతో బరితెగించారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాల రక్తం తాగిన ఈ నరరూప రాక్షసులు ఇప్పుడు చట్టం ముందు అడ్డంగా దొరికిపోయారని, చేసిన పాపాలు ఊరికే పోవని బ్రహ్మానందరెడ్డి అన్నారు.



# శ్రీవారి దర్శనానికి 18 గంటల సమయం

తిరుమల, డిసెంబర్ 14 (ఈవార్తలు): తిరుమల క్షేత్రం భక్తజనంతో కిటకిటలాడుతోంది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం కావడంతో రద్దీ మరింత పెరిగింది. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో భక్తుల క్యూ లైన్లు కాంప్లెక్స్ బయట వరకు విస్తరించాయి. కృష్ణతేజ గెస్ట్ హౌస్ వరకు భక్తులు బారులు తీరి స్వామి వారి దర్శనం కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. శ్రీవారి సేవకుల ద్వారా భక్తులకు అన్నప్రసాదం, పాలు, తాగునీరు అందిస్తున్నారు. ఇక శనివారం నాడు 80,113 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని టీటీడీ వెల్లడించింది. వీరిలో 31,683 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. ఒక్కరోజే శ్రీవారి హుండీకి రూ.3.71 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు ప్రకటించారు.

# మదనపల్లెలో వాజ్ పేయి విగ్రహం



ఆవిష్కరించిన ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి

మదనపల్లె, డిసెంబర్ 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లెలో భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆదివారం ఆవిష్కరించారు. బీజేపీ చేపట్టిన 'అటల్–మోదీ సుపరిపాలన యాత్ర'లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వాజ్‌పేయి శత జయంతి సంవత్సరంలో ఏపీ బీజేపీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని ధామి అన్నారు. వాజ్‌పేయి జాతీయవాదం, ప్రజాస్వామ్య విలువలు, మానవతావాదానికి ప్రతీకగా నిలిచిన గొప్ప రాజనీతిజ్ఞుడని కొనియాడారు. ఆయన హయాంలో పోఖ్రాన్ అణు పరీక్షలు, స్వర్ణ చతుర్భుజి రహదారి ప్రాజెక్ట్, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, టెలికాం విప్లవం వంటి చరిత్రాత్మక విజయాలు దేశం సాధించిందని గుర్తుచేశారు. జాతీయ ప్రయోజనాలే ముఖ్యమైనప్పుడు రాజకీయ భేదాలను ఎలా అధిగమించవచ్చో సంకీర్ణ ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపి నిరూపించారని తెలిపారు. వాజ్‌పేయి ఆశయాలే ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనకు స్ఫూర్తి అని ధామి పేర్కొన్నారు. స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలతో దేశం స్వావలంబన దిశగా పయనిస్తోందన్నారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ నిర్మూలన, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటి నిర్ణయాలు 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' దార్శనికతను బలపరిచాయని వివరించారు. ఈ సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ధామి ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు, రాబోయే పారిశ్రామిక, సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుపై అభినందనలు తెలిపారు. వాజ్‌పేయి స్ఫూర్తితోనే ఉత్తరాఖండ్ రాష్ట్రం ఏర్పడిందని, నేడు ప్రధాని మోదీ మార్గనిర్దేశంలో తమ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఆయన అన్నారు.

# ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయను

**పార్టీ కార్యకర్తగా ఉండటమే సంతృప్తి**

**మెగా బ్రదర్ నాగబాబు స్పష్టీకరణ**



మంగళగిరి, డిసెంబర్ 14 (ఈవార్తలు): జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగేంద్రబాబు (నాగబాబు) ప్రత్యక్ష రాజకీయాలపై కీలక ప్రకటన చేశారు. తనకు ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేదని, పార్టీ కార్యకర్తగా ఉండటంలోనే ఎక్కువ సంతృప్తి ఉందని స్పష్టం చేశారు. ఇటీవల ఉత్తరాంధ్రపై దృష్టి సారించిన ఆయన, శ్రీకాకుళంలో పార్టీ నేతలతో సమావేశమైన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. గత కొంతకాలంగా నాగబాబు శ్రీకాకుళంలో తరచూ పర్యటిస్తుండటంతో, ఆయన అక్కడి నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. ఈ ఊహాగానాలకు తెరదించేందుకే ఆయన తన నిర్ణయాన్ని ప్రకటించారు. "నాకు ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకుంటే గత ఎన్నికల్లోనే చేసేవాడిని. వచ్చే ఎన్నికల వరకు ఎందుకు ఆగాలి? ఐదారేళ్ల తర్వాత ఏం జరుగుతుందో ఇప్పుడే ఎలా చెబుతాం?" అని నాగబాబు అన్నారు. జనసేన ప్రధాన కార్యదర్శి కంటే పార్టీ కార్యకర్తగా పిలిపించుకోవడమే తనకు ఇష్టమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం నాగబాబు ఎమ్మెల్సీగా సేవలు అందిస్తున్నారు. గత ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని భావించినా, పొత్తులో భాగంగా ఆ సీటు బీజేపీకి దక్కిన విషయం తెలిసిందే. శ్రీకాకుళంలో ఇప్పటికే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న తరుణంలో, నాగబాబు పోటీ చేస్తారనే ప్రచారం కూటమిలో అనవసర ఇబ్బందులకు దారితీయవచ్చని భావించిన ఆయన, ముందుగానే తన వైఖరిని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రకటనతో ఉత్తరాంధ్రలో ఆయన పోటీపై వస్తున్న వదంతులకు తెరపడినట్లయింది.

# స్మార్ట్ రేషన్ కార్డుకు నేడే ఆఖరు

**గడువు దాటితే కార్డుకు రూ.200**




అమరావతి, డిసెంబర్ 14 (ఈవార్తలు): ఏపీలోని రేషన్‌కార్డుదారులకు అధికారులు కీలక సూచన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తున్న క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను ఉచితంగా పొందేందుకు రేపే చివరి అవకాశమని స్పష్టం చేశారు. ఈ గడువులోగా కార్డులు తీసుకోకపోతే, ఆ తర్వాత రుసుము చెల్లించి పొందాల్సి ఉంటుందని తెలిపారు. గడువుకు ఇంకొక్క రోజే మిగిలి ఉండటంతో ఇంకా కార్డులు తీసుకోని లబ్ధిదారులు వెంటనే తమ సచివాలయాలను సంప్రదించాలని తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా అధికారులు దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గడువు ముగిసిన తర్వాత కార్డు పొందాలంటే రూ.200 చెల్లించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. జిల్లాలో మొత్తం 6,14,000 రేషన్ కార్డులు ఉండగా, ఇప్పటికే 95.5 శాతం అంటే 5,87,000 కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్రంలోనే తొలివిడత పంపిణీలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. ఇంకా 27,000 కార్డులు పంపిణీ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. కొంతమంది లబ్ధిదారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల సిబ్బంది ఇంటింటికీ తిరిగినా వంద శాతం పంపిణీ పూర్తి కాలేకపోతోందని చెబుతున్నారు. గడువులోగా తీసుకోని కార్డులను కమిషనరేట్‌కు తిప్పి పంపుతామని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే.. కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుని, డిసెంబర్ నుంచి సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులకు ఇంకా స్మార్ట్ కార్డులు అందలేదు. ఉచిత పంపిణీ గడువు రేపటితో ముగియనుండటంతో తమ పరిస్థితి ఏంటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## గుడివాడలో భారీ అగ్నిప్రమాదం..

# షాపింగ్ కాంప్లెక్స్ దగ్ధం

గుడివాడ, డిసెంబర్ 14 (ఈవార్తలు) : ఏపీలోని కృష్ణా జిల్లా గుడివాడలో ఈ రోజు తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పట్టణంలోని నెహ్రూ చౌక్ సెంటర్‌లో ఉన్న ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లో మంటలు చెలరేగి పలు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లినప్పటికీ, తెల్లవారుజామున జరగడంతో ప్రాణ నష్టం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. నెహ్రూ చౌక్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న ఒక సెల్‌ఫోన్ దుకాణంలో మొదట మంటలు చెలరేగాయి. చూస్తుండగానే అవి పక్కనే ఉన్న ఇతర దుకాణాలకు వేగంగా వ్యాపించాయి. దట్టమైన పొగ, అగ్నికీలలు ఎగసిపడటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారు. ప్రమాదం గురించి తెలుసుకున్న దుకాణాల యజమానులు కాంప్లెక్స్ వద్దకు చేరుకుని, తమ దుకాణాలు కాలిపోవడాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ, కచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# మల్యాలలో 'జయ'కేతనం

**930 భారీ మెజార్టీతో బొట్ల జయ ప్రసాద్ విజయం**

**జిల్లాలోనే అతిపెద్ద పంచాయతీగా రికార్డు**

మల్యాల, డిసెంబర్ 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోని మల్యాల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాన్ని బీజేపీ బలపరిచిన బొట్ల జయ ప్రసాద్ కైవసం చేసుకున్నారు. పంచాయతీ పరిధిలో 9,978 ఓట్లకు గాను, 7141 ఓట్లు పోలయ్యాయి. తన సమీప ప్రత్యర్థిపై 930 ఓట్ల భారీ మెజారిటీతో జయ ప్రసాద్ విజయం సాధించారు. జగిత్యాల జిల్లాలో 16 అత్యధిక వార్డులతో మల్యాల మేజర్ గ్రామపంచాయతీ తొలి స్థానంలో ఉంది.

**వార్డుల వారీగా గెలుపు**

1వ వార్డు బొబ్బిలి వెంకటస్వామి, 2వ వార్డు కటకం వినయ్
3వ వార్డు పోచంపెల్లి శైలేష్ , 4వ వార్డు ఇట్టె రమణ
5వ వార్డు బైరి బీరయ్య, 6వ వార్డు జవ్వాజి శ్రీను
7వ వార్డు బట్టు నవీన్, 8వ వార్డు యాగండ్ల సుమన్
9వ వార్డు గడుగు రఘు , 10వ వార్డు కట్కూరి అరుణ్
11 వ వార్డు శనిగారపు తిరుపతి, 12వ వార్డు మల్యాల గణేష్
13వ వార్డు గడుగు అంజయ్య., 14వ వార్డు పోతరాజ్ శ్రీధర్
15వ వార్డు పోతరాజ్ శ్రీను, 16వ వార్డు గండ్ల వేణు

**71.57% పోలింగ్**

మల్యాల గ్రామపంచాయతీలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకెల్లా అత్యధికంగా ఓట్లు పోలయ్యాయి. పంచాయతీ పరిధిలో 9978 ఓట్లు ఉండగా, 7141 ఓట్లు పోలయ్యాయి. వీరిలో 3134 మంది పురుషులు ఉండగా, 4007 మహిళా ఓటర్లు ఉన్నారు. పోలైన ఓట్లు 71.57 శాతంగా ఉంది.



# రామప్పలో యునెస్కో భారత రాయబారి



రామప్ప, డిసెంబర్ 14 (ఈవార్తలు): పారిస్ నుంచి వచ్చిన యునెస్కో భారత రాయబారి, శాశ్వత ప్రతినిధి విశాల్ వీ శర్మ 2025 శనివారం ములుగు జిల్లా పాలంపేట గ్రామంలో ఉన్న ప్రపంచ వారసత్వ కేంద్రమైన రుద్రేశ్వర రామప్ప ఆలయాన్ని సందర్శించారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ), రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంరక్షణ, పరిరక్షణ చర్యలను ఆయన సమీక్షించారు. యునెస్కోకు సంబంధించిన ప్రతిష్ఠాత్మక ప్రపంచ వారసత్వ కమిటీ 46వ సెషన్‌కు విశాల్ వీ శర్మహొచైర్మన్‌గా వ్యవహరించారు. ఈ కీలక పదవిని నిర్వహించిన మొదటి భారతీయుడు. ఇటీవల ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగిన ఇంటర్ గవర్నమెంటల్ కమిటీ ఫర్ సేఫ్‌గార్డింగ్ ది ఇంటాంజబుల్ కల్చరల్ హెరిటేజ్ 20వ సెషన్‌కు కూడా ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలోనే దీపావళిని యునెస్కోకు చెందిన ఐసీహెచ్ జాబితాలో చేర్చారు. 2021లో విశాల్ వీ శర్మ సారథ్యంలోనే రామప్ప ఆలయం కూడా ప్రపంచ వారసత్వ జాబితాలో చేరింది. ఇన్‌కోయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్) కార్యక్రమం కోసం హైదరాబాద్ వచ్చిన ఆయన.. ఆలయ పరిరక్షణ చర్యలను సమీక్షించేందుకు ములుగు జిల్లాలో పర్యటించారు. ఏఎస్ఐ నుంచి డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్టు డాక్టర్ హెచ్‌ఆర్ దేశాయ్, డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజికల్ ఇంజనీర్ కృష్ణ చైతన్య, అసిస్టెంట్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్టు డాక్టర్ రోహిణి పాండే–అంబేద్కర్, ఇన్‌కోయిస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ నాగోజీరావు తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లిలో బార్క్ క్యాంపస్

**3 వేల ఎకరాల్లో పరిశోధన కేంద్రం ఏర్పాటు**

అనకాపల్లి, డిసెంబర్ 14 (ఈవార్తలు): భారత అణుశక్తి రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశంలో అణు శాస్త్ర పరిశోధనలు, ఆధునిక రియాక్టర్ టెక్నాలజీలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) ఆంధ్రప్రదేశ్‌లో భారీ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. అనకాపల్లి జిల్లాలో సుమారు 3,000 ఎకరాల విస్తీర్ణంలో ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే 1,200 హెక్టార్లకు పైగా రెవెన్యూ భూమిని సేకరించారు. దీనికి అదనంగా అవసరమైన 148.15 హెక్టార్ల అటవీ భూమిని బదలాయించేందుకు బార్క్ చేసిన ప్రతిపాదనకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ ఇటీవల సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ప్రాజెక్టు ప్రణాళికలో ఈ అటవీ భూమి అత్యంత కీలకం కావడంతో, ఈ అనుమతితో పనులకు తొలి అడ్డంకి తొలగిపోయింది. దేశీయంగా అణు ఆవిష్కరణలు, స్వచ్ఛ ఇంధన వనరులపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అణు పరిశోధనలు, రియాక్టర్ల అభివృద్ధి, నూతన ఇంధన సాంకేతికతలలో బార్క్ విస్తరిస్తున్న పాత్రకు ఈ కొత్త క్యాంపస్ ఊతమిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే భారత్ స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల డిజైన్, అభివృద్ధి పనులను బార్క్ ప్రారంభించిందని కేంద్రం ఈ మధ్యే పార్లమెంటుకు తెలియజేసింది. మరోవైపు, రష్యాకు చెందిన రోసటామ్‌తో కలిసి చిన్న, పెద్ద అణు విద్యుత్ ప్రాజెక్టులపై సహకారం కోసం భారత అణుశక్తి విభాగం చర్చలు జరుపుతోంది.

# రాష్ట్రంలో తుగ్లక్ పాలన: తలసాని

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఈవార్తలు): రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన తుగ్లక్ ను తలపించేలా ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ఆదివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద సనత్ నగర్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం ఎమ్మెల్యే తలసాని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన నాయకులు మాట్లాడుతూ నూతన డివిజన్ల ఏర్పాటు, డివిజన్ల విభజన అంతా గందరగోళంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో తుగ్లక్ ప్రభుత్వం హరిబరిగా ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ లను జీహెచ్ఎంసీ లో విలీనం చేసి 150 ఉన్న డివిజన్ లను 300కు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా ఆఫీసులలో కూర్చొని గూగుల్ మ్యాప్‌ల ఆధారంగా డివిజన్లను ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, కాలనీలు, బస్తీ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా డివిజన్ ఏర్పాటు, విభజన చేశారని ధ్వజమెత్తారు. అభ్యంతరాలు తెలియజేయడానికి స్వల్ప సమయం ఇవ్వడం సరికాదని అన్నారు. కనీసం నెల రోజుల గడువు పెట్టి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల అభిప్రాయాలను తీసుకొని వారి సూచనల మేరకు డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నూతన డివిజన్ ల పేర్లను కూడా ఇష్టమొచ్చినట్లు కాకుండా స్థానిక ప్రజల విశ్వాసాన్ని పరిగణలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజల నుండి వచ్చే అభ్యంతరాలకు అనుగుణంగా మార్పులు చేయాలని, లేని పక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజల



# అమెరికా ఆర్థికానికి భారతీయులే బలం

**కాంగ్రెస్‌మన్ శ్రీ థానేదార్ స్పష్టీకరణ**

న్యూయార్క్: భారత్-అమెరికా మధ్య బలమైన బంధం ఇరు దేశాలకూ ఎంతో మేలు చేస్తుందని భారత సంతతికి చెందిన అమెరికన్ కాంగ్రెస్‌మన్ శ్రీ థానేదార్ అన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో భారతీయ అమెరికన్లు పోషిస్తున్న పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. డెట్రాయిట్‌లో జరిగిన 'ఇండియా అబ్రాడ్ డైలాగ్' ప్రారంభ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారతీయ వలసదారులు తమతో పాటు విలువైన స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్), వ్యవస్థాపక నైపుణ్యాలను అమెరికాకు తీసుకొస్తున్నారని, దేశ ఆర్థిక పోటీతత్వానికి ఇవి చాలా కీలకమని థానేదార్ వివరించారు. రక్షణ, సాంకేతికత, విద్య, సరఫరా గొలుసుల వంటి అనేక రంగాల్లో ఇరు దేశాలు సహజ భాగస్వాములని ఆయన అభివర్ణించారు. గ్రీన్‌కార్డ్ బ్యాక్‌లాగ్‌లు, హెచ్-1బీ వీసాలపై అనిశ్చితి కారణంగా భారతీయ అమెరికన్లు ప్రస్తుతం భయానక పరిస్థితుల్లో జీవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇమ్మిగ్రేషన్ సంస్కరణల కోసం తన పోరాటం కొనసాగిస్తానని థానేదార్ హామీ ఇచ్చారు. అదే సమయంలో, అమెరికాలో పెరుగుతున్న హిందూ వ్యతిరేక ద్వేషాన్ని, హింసను తీవ్రంగా ఖండించారు. తాను 'యాంటీ-హిందూఫోబియా' తీర్మానానికి నాయకత్వం వహించానని, సమాజంలో మతపరమైన విద్వేషాలకు చోటు లేదని స్పష్టం చేశారు. భారతీయ అమెరికన్లు రాజకీయాల్లో, పౌర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని శ్రీ థానేదార్ పిలుపునిచ్చారు. అమెరికాలోని 10 నగరాల్లో జరగనున్న ఈ డైలాగ్ సిరీస్, విధాన రూపకర్తలకు, ప్రవాస భారతీయులకు మధ్య వారధిగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. తదుపరి సమావేశం చికాగోలో జరగనుండగా, దానికి కాంగ్రెస్‌మన్ రాజా కృష్ణమూర్తి హాజరుకానున్నారు.

# ఓట్ల దొంగ.. గద్దె దిగు

**ఢిల్లీలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' నిరసన కార్యక్రమం**

**ఎన్నికల సంఘం బీజేపీతో కుమ్మక్కైందని రాహుల్ ఆరోపణ**



న్యూఢిల్లీ: ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'ఓట్ల దొంగ.. గద్దె దిగు' పేరిట భారీ నిరసన సభ నిర్వహించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సోనియా గాంధీ సహా పలువురు సీనియర్ నేతలు, వేలాది మంది కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ... కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) బీజేపీ ప్రభుత్వంతో కుమ్మక్కైందని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి.. బీజేపీ కోసం పనిచేస్తున్నారని రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. "సత్యానికి, అసత్యానికి మధ్య జరుగుతున్న ఈ పోరాటంలో ఎన్నికల సంఘం బీజేపీ వైపు నిలబడింది. బీజేపీ ఎన్నికల సమయంలో రూ.10,000 పంపిణీ చేసినా ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు" అని ఆయన విమర్శించారు. తాము సత్యం వైపు నిలబడి నరేంద్ర మోదీ-ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ధీమా వ్యక్తం చేశారు. "అధికారం ఉన్నవారినే ప్రపంచం గౌరవిస్తుందని, సత్యానికి విలువ లేదని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ భావన. కానీ మా సిద్ధాంతం ప్రకారం సత్యమే అత్యంత ముఖ్యమైనది. ఆ సత్యంతోనే మేము మోదీ, అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వాన్ని దేశం నుంచి తొలగిస్తాం" అని రాహుల్ ప్రతిజ్ఞ చేశారు. బీహార్‌లో జరిగిన 'ఓటర్ అధికార్ యాత్ర'తో ప్రారంభమైన 'ఓట్ల చోరీ' ప్రచారాన్ని దేశవ్యాప్తంగా ఉధృతం చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. గతంలో కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలలో ఓట్ల జాబితాలో అవకతవకలు జరిగాయని రాహుల్ ఆరోపించగా, ఈసీ వాటిని నిరాధారమైనవని కొట్టిపారేసింది. 2026లో అసోం, కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, ఈ అంశాన్ని సజీవంగా ఉంచాలని కాంగ్రెస్ భావిస్తోంది.

# బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్

**ప్రస్తుతం బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న నబిన్**

**నడ్డా పదవీకాలం ముగియడంతో పార్టీలో మార్పులు**

**ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవజ్ఞుడైన నేత**




న్యూఢిల్లీ: బీజేపీ నూతన జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీహార్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న నితిన్ నబిన్‌ను నియమించారు. ఈ మేరకు బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఆదివారం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. 2020 జనవరిలో బాధ్యతలు చేపట్టిన నడ్డా, 2024 లోక్‌సభ ఎన్నికలతో సహా పలు కీలక రాజకీయ ఘట్టాల నేపథ్యంలో పలుమార్లు పదవీకాలం పొడిగింపు పొందారు. పార్టీలో నాయకత్వ మార్పుల ప్రక్రియ జరుగుతున్న తరుణంలో ఈ తాజా పునర్వ్యవస్థీకరణకు ప్రాధాన్యం ఏర్పడింది. నితిన్ నబిన్ బీహార్ రాష్ట్రానికి చెందిన ఒక అనుభవజ్ఞుడైన బీజేపీ నేత. రాష్ట్ర రాజకీయాల్లో ఆయన ఒక ముఖ్యమైన వ్యక్తిగా గుర్తింపు పొందారు. పాట్నాలో జన్మించిన ఆయన, దివంగత బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే నబిన్ కిశోర్ ప్రసాద్ సిన్హా కుమారుడు. తండ్రి రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని నితిన్ నబిన్ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. నితిన్ నబిన్ ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి తన సత్తా చాటారు. తన తండ్రి మరణం తర్వాత 2006లో పాట్నా వెస్ట్ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికలో తొలిసారిగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత బంకీపుర్ నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు - 2010, 2015, 2020, 2025 ఎన్నికల్లో విజయదుందుభి మోగించారు. ముఖ్యంగా 2020 అసెంబ్లీ ఎన్నికల్లో, నటుడు, రాజకీయ నాయకుడైన శత్రుఘ్న సిన్హా కుమారుడు లవ్ సిన్హాపై భారీ మెజార్టీతో గెలిచి జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచారు. ఇటీవల ముగిసిన 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఆయన తన సమీప ప్రత్యర్థిపై 51,000 ఓట్లకు పైగా భారీ ఆధిక్యంతో మరోసారి ఘన విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన నితీశ్ కుమార్ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణ శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో బలమైన నేతగా, ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన వ్యక్తిగా నితిన్ నబిన్‌కు మంచి పేరుంది. ఇప్పుడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడు కావడంతో, ఆయన రాజకీయ ప్రస్థానంలో ఇది ఒక కీలక మలుపుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# స్టాక్ మార్కెట్‌లో భారీ నష్టాలు



ముంబై: గత వారం దేశీయ స్టాక్ మార్కెట్లలో నెలకొన్న బలహీనమైన సెంటిమెంట్ కారణంగా దేశంలోని అత్యంత విలువైన టాప్-10 కంపెనీలలో 8 సంస్థలు భారీగా నష్టపోయాయి. ఈ కంపెనీలు వారం వ్యవధిలో తమ మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) నుంచి ఏకంగా రూ.79,129.21 కోట్లను కోల్పోయాయి. ఇందులో బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా నష్టపోయిన సంస్థగా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ విలువ ఏకంగా రూ.19,289.7 కోట్లు తగ్గి రూ.6,33,106.69 కోట్లకు చేరింది. ఆ తర్వాతి స్థానంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఉంది. ఈ బ్యాంకు మార్కెట్ క్యాప్ రూ.18,516.31 కోట్లు క్షీణించి రూ.9,76,668.15 కోట్లకు పడిపోయింది. ఇదే బాటలో భారతీ ఎయిర్‌టెల్ (రూ.13,884 కోట్లు), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.7,846 కోట్లు), ఇన్ఫోసిస్ (రూ.7,145 కోట్లు), టీసీఎస్ (రూ.6,783 కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.4,460 కోట్లు) కూడా భారీగా నష్టపోయాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (%ూ×జ%) కూడా రూ.1,201 కోట్లు నష్టపోయింది. అయితే, ఈ ప్రతికూల మార్కెట్ పరిస్థితుల్లోనూ రిలయన్స్ ఇండస్ట్రీస్, లార్సెన్ %డ% టూబ్రో (%ాడు%) లాభాలను నమోదు చేశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.20,434.03 కోట్లు పెరిగి రూ.21,05,652.74 కోట్లకు చేరుకుంది. లార్సెన్ %డ% టూబ్రో విలువ రూ.4,910.82 కోట్లు పెరిగి రూ.5,60,370.38 కోట్లకు చేరింది. గత వారం బీఎస్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ 444.71 పాయింట్లు (0.51 శాతం) పడిపోవడం ఈ నష్టాలకు ప్రధాన కారణం. మార్కెట్ ఒడుదొడుకులకు గురైనప్పటికీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, టీసీఎస్ వంటి సంస్థలు దేశంలో అత్యంత విలువైన కంపెనీలుగా తమ స్థానాలను నిలబెట్టుకున్నాయి.




# కొవిడ్ వ్యాక్సిన్‌కు, గుండెపోటుకు లింకు లేదు!

**ఢిల్లీ ఎయిమ్స్ నిర్వహించిన ఏడాది పరిశోధనలో స్పష్టత**

**గుండె జబ్బులే యువత మరణాలకు ప్రధాన కారణమని గుర్తింపు**

న్యూఢిల్లీ: దేశంలో యువతలో ఆకస్మిక మరణాలపై కొంతకాలంగా నెలకొన్న ఆందోళనలకు ఢిల్లీ ఎయిమ్స్ పరిశోధన తెరదించింది. కోవిడ్-19 వ్యాక్సిన్‌కు, యువతలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు ఎలాంటి శాస్త్రీయ సంబంధం లేదని స్పష్టం చేసింది. వ్యాక్సిన్లు సురక్షితమైనవేనని, వాటి సమర్థతను ఈ అధ్యయనం మరోసారి ధృవీకరించిందని పరిశోధకులు ఆదివారం తెలిపారు. భారత వైద్య పరిశోధన మండలికి చెందిన 'ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్'లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. ఏడాది పాటు సాగిన ఈ పరిశోధనలో భాగంగా, 18 నుంచి 45 ఏళ్ల వయసు మధ్య ఆకస్మికంగా మరణించిన వారి కేసులను ఎయిమ్స్ వైద్యులు క్షుణ్ణంగా విశ్లేషించారు. ఇందుకోసం పోస్టుమార్టం, ఇమేజింగ్, హిస్టోపాథలాజికల్ పరీక్షలతో పాటు మృతుల కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఈ విశ్లేషణలో కోవిడ్-19 వ్యాక్సిన్ తీసుకున్న వారికి, తీసుకోని వారికి మధ్య ఆకస్మిక మరణాల విషయంలో గణాంకపరంగా ఎటువంటి తేడా లేదని తేలింది. యువతలో సంభవించిన మరణాలకు ప్రధాన కారణంగా గుండె సంబంధిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. శ్వాసకోశ సమస్యలు, ఇతర అనారోగ్యాలు కూడా కొన్ని కేసులలో మరణానికి దారితీశాయని తేలింది. ఈ ఫలితాలు ప్రపంచవ్యాప్తంగా జరిగిన శాస్త్రీయ పరిశోధనల ఫలితాలతో సరిపోలుతున్నాయని ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్ అరవ తెలిపారు. "వ్యాక్సిన్ల వల్లే యువత చనిపోతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాలు, నిరాధారమైన నివేదికలను ఈ అధ్యయనం ఖండిస్తోంది. ప్రజలు ఇలాంటి అపోహలను నమ్మకుండా, శాస్త్రీయ ఆధారాలను మాత్రమే విశ్వసించాలి" అని ఆయన సూచించారు. యువతలో ఆకస్మిక మరణాలకు గుర్తించని అనారోగ్య సమస్యలే కారణమని, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలు, జీవనశైలి మార్పుల ద్వారా ఇలాంటి ముప్పులను తగ్గించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు.

# లిబియాలో గుజరాతీ కుటుంబం కిడ్నాప్

**దంపతులు, మూడేళ్ల చిన్నారిని బందీలుగా పట్టుకున్న దుండగులు**

**విడుదల చేయాలంటే రూ. 2 కోట్లు కావాలని డిమాండ్**

**రంగంలోకి దిగిన కేంద్ర విదేశాంగ శాఖ, గుజరాత్ ప్రభుత్వం**



న్యూఢిల్లీ: అక్రమంగా విదేశాలకు వలస వెళ్లే ప్రయత్నంలో గుజరాత్‌కు చెందిన ఓ కుటుంబం లిబియాలో కిడ్నాప్‌కు గురైంది. దంపతులతో పాటు వారి మూడేళ్ల కుమార్తెను కూడా బంధించిన దుండగులు, వారిని విడిచిపెట్టాలంటే రూ. 2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వివరాలను అధికారులు వెల్లడించారు. మెహసానా జిల్లాలోని బాదల్‌పురా గ్రామానికి చెందిన కిస్మత్‌సిన్హ్ చావ్డా, ఆయన భార్య హీనాబెన్, కుమార్తె దేవాన్షీ.. పోర్చుగల్‌లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే కిస్మత్‌సిన్హ్ సోదరుడు అక్కడే ఉంటుండటంతో, ఓ పోర్చుగల్ ఏజెంట్ సహాయంతో వారు ప్రయాణం ప్రారంభించారు. ఈ విషయాన్ని మెహసానా ఎస్పీ హిమాన్షు సోలంకి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ఈ కుటుంబం నవంబర్ 29న అహ్మదాబాద్ నుంచి దుబాయ్ వెళ్లింది. అక్కడి నుంచి వారిని లిబియాలోని బెంఘాజీ నగరానికి తరలించగా, అక్కడే వారు కిడ్నాప్‌కు గురయ్యారు. అనంతరం కిడ్నాపర్లు మెహసానాలోని వారి బంధువులను సంప్రదించి రూ. 2 కోట్లు డిమాండ్ చేశారు. ఈ కేసులో ప్రమేయమున్న ఏజెంట్లు భారతీయులు కాదని పోలీసులు స్పష్టం చేశారు. బాధితుల బంధువులు శుక్రవారం తమను సంప్రదించారని మెహసానా కలెక్టర్ ఎస్.కె. ప్రజాపతి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సీజే చావ్డా కూడా ఈ అంశాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఈ విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు తెలియజేసి, వారిని సురక్షితంగా విడిపించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు.

# ఏఐలో భారత్ నం.3

**యూనివర్సిటీ గ్లోబల్ ఏఐ వైబ్రెన్సీ టూల్ వెల్లడి**

**అగ్రస్థానంలో అమెరికా, రెండో స్థానంలో చైనా**

న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ తన సత్తా చాటుతోంది. ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వమున్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆదివారం విడుదల చేసిన 'గ్లోబల్ ఏఐ వైబ్రెన్సీ టూల్' ర్యాంకింగ్స్‌లో ఈ విషయం వెల్లడైంది. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ రంగం, నైపుణ్యం కలిగిన మానవ వనరులే ఈ ఘనతకు కారణమని నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో 78.6 స్కోర్‌తో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, 36.95 స్కోర్‌తో చైనా రెండో స్థానంలో నిలిచింది. భారత్ 21.59 స్కోర్‌తో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రమంలో దక్షిణ కొరియా, యూకే, సింగపూర్, జపాన్, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి అనేక అభివృద్ధి చెందిన దేశాలను భారత్ అధిగమించడం విశేషం. పరిశోధన, అభివృద్ధి, టాలెంట్ లభ్యత, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ విధానాలు వంటి అనేక కీలక అంశాలను విశ్లేషించి స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ ర్యాంకులను కేటాయించింది. ముఖ్యంగా 'టాలెంట్' విభాగంలో భారత్ ప్రపంచంలోని టాప్-3 దేశాల్లో ఒకటిగా నిలిచింది. దేశంలోని ఇంజనీర్లు, డెవలపర్ల భారీ సంఖ్య ఇందుకు దోహదపడింది. తక్కువ-మధ్య ఆదాయ దేశాల కేటగిరీలో ఈ జాబితాలో ఇంత ఉన్నత స్థానంలో నిలిచిన ఏకైక దేశం భారత్ కావడం గమనార్హం.

# ఎదురుపడ్డ రాహుల్-అదానీ

**ఫోటోలు తీయకుండా అడ్డుకున్న సుప్రియా సూలే!**

ముంబై: రాజకీయాల్లో మాటల కన్నా కనిపించే దృశ్యాలకే ప్రాధాన్యం ఎక్కువ. కొన్నిసార్లు ఒకే ఒక్క ఫోటో పెను దుమారం రేపుతుంది. ఈ విషయం తెలిసే కాబోలు, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పుట్టినరోజు విందులో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆయన నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ముఖాముఖిగా కలుసుకున్నారు. ఇద్దరూ కరచాలనం కూడా చేసుకున్నారు. అయితే, ఈ అరుదైన దృశ్యం కెమెరాల్లో బందీ కాకుండా నిర్వాహకులు చాలా జాగ్రత్త పడ్డారు. డిసెంబర్ 11న శరద్ పవార్ 85వ పుట్టినరోజు సందర్భంగా ఈ విందు జరిగింది. రాజకీయాలకు అతీతంగా సంబంధాలు నెరిపే పవార్, ఈ కార్యక్రమానికి అన్ని పార్టీల నేతలతో పాటు వ్యాపార ప్రముఖులను కూడా ఆహ్వానించారు. ఈ విందులో రాహుల్ గాంధీ, పవార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్న ఫోటోలు బయటకు వచ్చినా, రాహుల్-అదానీ కలిసిన ఫోటోలు మాత్రం కనిపించలేదు. సీనియర్ జర్నలిస్టులు రాజ్‌దీప్ సర్దేశాయ్, ఆదేశ్ రావల్ ఒక చర్చా కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు.

# 'రామ' మంత్ర బ్యాంక్

న్యూఢిల్లీ: బ్యాంకు అంటేనే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది డబ్బు, లావాదేవీలు. కానీ రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఒక విభిన్నమైన బ్యాంకు ఉంది. ఇక్కడ ధనానికి బదులుగా 'రామ' నామాలను డిపాజిట్లుగా స్వీకరిస్తారు. గోవింద్ దేవ్ జీ ఆలయ ప్రాంగణంలో 'రామ్ నామ ధన సంగ్రహ బ్యాంక్' పేరుతో ఇది కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ బ్యాంకులో సుమారు 14 వేల కోట్లకు పైగా రామనామాలను భక్తులు డిపాజిట్ చేశారు. బాలకృష్ణ పురోహిత్ అనే వ్యక్తి 1987లో ఈ బ్యాంకును ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులు తాము రాసిన రామనామ పుస్తకాలను ఇక్కడ డిపాజిట్ చేస్తారు. ప్రతి భక్తుడికి ఒక 'మంత్ర' అకౌంట్‌ను కేటాయిస్తారు. సాధారణ బ్యాంకు పాస్‌బుక్ మాదిరిగానే ఇందులో భక్తుడి పేరు, వారు ఇప్పటివరకు జమ చేసిన రామనామాల సంఖ్య వంటి వివరాలు నమోదు చేస్తారు. భక్తులు కొత్త పుస్తకాలను తీసుకెళ్లి, తమ లక్ష్యం పూర్తయ్యాక తిరిగి వాటిని ఇక్కడ జమ చేస్తుంటారు. ఇక్కడ ఎలాంటి లాభనష్టాలు, వడ్డీలు ఉండవని, కేవలం భక్తి మాత్రమే ప్రధానమని నిర్వాహకులు చెబుతున్నారు. భక్తుల నుంచి ఆదరణ పెరుగుతుండటంతో, ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తున్న ఈ ఆధ్యాత్మిక బ్యాంకు కోసం ఒక శాశ్వత భవనాన్ని నిర్మిస్తుండటం విశేషం.

# మోదీ సమాధి తవ్వుతాం అంటూ నినాదాలు

**స్లోగన్స్‌తో తమకు సంబంధం లేదన్న కాంగ్రెస్**

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో నిర్వహించిన 'ఓట్ల చోరీ' నిరసన కార్యక్రమం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా కొందరు కార్యకర్తలు అనుచిత నినాదాలు చేయడంతో రాజకీయ దుమారం రేగింది. అయితే, ఈ వివాదంతో తమకు ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వం కుమ్మక్కై ఎన్నికలను తారుమారు చేస్తున్నాయని ఆరోపిస్తూ ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కొందరు కార్యకర్తలు "మోదీ తేరీ కబ్ర ఖుదేగీ, ఆజ్ నహీ తో కల్ ఖుదేగీ" (మోదీ నీ సమాధి తవ్వుతాం, ఈ రోజు కాకపోతే రేపు) అంటూ నినాదాలు చేశారు. దీంతో పాటు "ఓట్ల దొంగ.. గద్దె దిగు" అంటూ కూడా స్లోగన్స్ వినిపించాయి. ఈ నినాదాలు తీవ్ర చర్చనీయాంశం కావడంతో కాంగ్రెస్ పార్టీ స్పందించింది. కాంగ్రెస్ ఎంపీ తారిఖ్ అన్వర్ మాట్లాడుతూ.. "అవి పార్టీ అధికారిక నినాదాలు కావు. అవగాహన లేని కొందరు కార్యకర్తలు అలా చేసి ఉండొచ్చు. 'ఓట్ల దొంగ.. గద్దె దిగు' అన్నదే మా అసలు నినాదం," అని వివరించారు. మరో సీనియర్ నేత నానా పటోలే మరో అడుగు ముందుకేసి, ఇది బీజేపీ కుట్ర అయి ఉండొచ్చని ఆరోపించారు. "ఇలాంటి నినాదాలు కాంగ్రెస్ పార్టీ నుంచి రావు. అసలు సమస్యను పక్కదారి పట్టించేందుకే బీజేపీ తమ వాళ్లను పంపి ఇలాంటి నినాదాలు చేయించి ఉండొచ్చు. 'ఓట్ల దొంగ.. గద్దె దిగు' అనే నినాదాన్ని రాహుల్ గాంధీ ఇచ్చారు. మిగతా వాటితో మాకు సంబంధం లేదు" అని ఆయన స్పష్టం చేశారు.

# దక్షిణాఫ్రికాలో కుప్పకూలిన హిందూ ఆలయం

**భారత సంతతి వ్యక్తి సహా నలుగురు దుర్మరణం**

న్యూఢిల్లీ: క్వాజులు-నాటల్ ప్రావిన్స్‌లో నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల హిందూ దేవాలయం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో భారత సంతతికి చెందిన వ్యక్తి సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. డర్బన్‌కు ఉత్తరాన ఉన్న రెడ్‌క్లిఫ్ ప్రాంతంలో 'న్యూ అహోబిలం టెంపుల్ ఆఫ్ ప్రొటెక్షన్' పేరుతో ఈ ఆలయ నిర్మాణం జరుగుతోంది. శుక్రవారం కార్మికులు పనుల్లో నిమగ్నమై ఉండగా.. భవనంలోని ఒక భాగం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆలయ ట్రస్ట్ కార్యవర్గ సభ్యుడు, నిర్మాణ ప్రాజెక్టు మేనేజర్ అయిన విక్కీ జైరాజ్ పాండే (52) మరణించినట్లు అధికారులు గుర్తించారు. ఆలయ ప్రారంభం నుంచి ఆయన నిర్మాణ పనులను దగ్గరుండి చూసుకుంటున్నారు. ఈ ఘటనలో మొత్తం నలుగురు మరణించినట్లు శనివారం అధికారులు ధ్రువీకరించారు. అయితే, ఈ ఆలయ నిర్మాణానికి తమ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని స్థానిక ఇథెక్విని మున్సిపాలిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. దీంతో ఇది అక్రమ నిర్మాణం అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిలో ఒకరి నుంచి మొదట ఫోన్ కాల్స్ వచ్చినా, ఆ తర్వాత సంబంధాలు తెగిపోయాయి. ప్రతికూల వాతావరణం కారణంగా శనివారం మధ్యాహ్నం సహాయక చర్యలను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రాణాలతో ఎవరైనా బయటపడే అవకాశాలు తక్కువని నిపుణులు భావిస్తున్నప్పటికీ, అవసరమైనంత కాలం సహాయక చర్యలు కొనసాగిస్తామని స్థానిక మంత్రి హామీ ఇచ్చారు.

# సిరియాలో ఐసిస్ పంజా.. ఇద్దరు అమెరికా సైనికుల మృతి

న్యూయార్క్: సిరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు, ఒక పౌర అనువాదకుడు మరణించారు. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. దీనికి చాలా తీవ్రమైన ప్రతీకారం ఉంటుందని హెచ్చరించారు. శనివారం జరిగిన ఈ దాడిలో మరో ముగ్గురు సైనికులు గాయపడినట్లు ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో తెలిపారు. ఐసిస్‌ను నిర్మూలించేందుకు అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఇన్హెరెంట్ రిజాల్వ్'లో భాగంగా ఈ సైనికులు పనిచేస్తున్నారు. పాల్మైరా ప్రాంతంలో కీలక నేతలతో సమావేశమవుతున్న సమయంలో ఈ దాడి జరిగింది. గతేడాది డిసెంబర్‌లో బషర్ అల్-అస్సాద్ అధికారం కోల్పోయిన తర్వాత సిరియాలో అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోవడం ఇదే తొలిసారి. దాడికి పాల్పడిన వ్యక్తి సిరియా ప్రభుత్వ దళాలకు చెందిన సైనికుడేనని అక్కడి ప్రభుత్వం అంగీకరించడం గమనార్హం. అయితే, అతడిని ఇప్పటికే మట్టుబెట్టామని, అంతర్గత భద్రతా విభాగంలో అతడికి ఎలాంటి నాయకత్వ పాత్ర లేదని సిరియా ప్రభుత్వ ప్రతినిధి స్పష్టం చేశారు. పాల్మైరా ప్రాంతంలో ఐసిస్ దాడి జరిగే ప్రమాదం ఉందని తాము ముందే అమెరికాను హెచ్చరించినా వారు పట్టించుకోలేదని సిరియా ఆరోపించింది. ఈ దాడి జరిగిన ప్రాంతం సిరియా కొత్త ప్రభుత్వ పూర్తి నియంత్రణలో లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఘటనపై సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరా తీవ్ర ఆగ్రహంతో, ఆవేదనతో ఉన్నారని తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో భాగంగా ఇటీవలే అల్-షరా వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో సమావేశమయ్యారు. తాజా పరిణామం ఇరు దేశాల మధ్య సహకారానికి పరీక్షగా నిలిచింది.

## వయ్యారి చిత్రం



## 19 నుంచి ఓటీటీలో ప్రేమంటే

రీసెంట్ గా మన టాలీవుడ్ నుంచి రిలీజ్ కి వచ్చిన చిత్రాల్లో యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ప్రియదర్శి హీరోగా కయల్ ఆనంది హీరోయిన్ గా దర్శకుడు నవనీత్ శ్రీరామ్ తెరకెక్కించిన చిత్రం "ప్రేమంటే" కూడా ఒకటి. గత నవంబర్ 21న థియేటర్స్ లో రిలీజ్ అయ్యిన ఈ సినిమా కంటెంట్ పరంగా డీసెంట్ టాక్ ని ఆడియెన్స్ నుంచి అందుకుంది. ఇక అలా థియేటర్స్ రన్ తర్వాత ఫైనల్ గా ఓటిటి రిలీజ్ కి సిద్ధం అయ్యింది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోగా అందులో ఈ సినిమా ఎప్పుడు నుంచి స్ట్రీమ్ అవుతుంది అనేది కన్ఫర్మ్ చేశారు. ఈ డిసెంబర్ 19 నుంచి ఓటిటిలో ప్రేమంటే అందుబాటులో ఉంటుందట. తెలుగు, కన్నడ ఇంకా తమిళ, మలయాళ భాషల్లో ఈ సినిమా అందుబాటులోకి ఉంటుంది అని కన్ఫర్మ్ చేశారు. సో ఈ కామెడీ క్రైమ్ డ్రామాని అప్పుడు మిస్ అయ్యినవారు ఇప్పుడు ఓటిటిలో ఇంకొన్ని రోజుల్లో చూడొచ్చు.







## 'రాజా సాబ్' నుంచి 'సహానా సహానా' ప్రోమో రిలీజ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, విలక్షణ దర్శకుడు మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ది రాజా సాబ్'. రొమాంటిక్ కామెడీ హారర్ జానర్‌లో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. తాజాగా చిత్ర యూనిట్ ఈ సినిమా నుంచి రెండో సింగిల్ 'సహానా సహానా' సాంగ్ ప్రోమోను విడుదల చేసింది. ఇది ఒక సోల్‌ఫుల్ మెలోడీగా సంగీత ప్రియులను ఆకట్టుకుంటోంది. తమన్ స్వరపరిచిన ఈ మెలోడీకి కృష్ణకాంత్ (కేకే) సాహిత్యం అందించారు. స్పెయిన్‌లోని అందమైన లొకేషన్లలో ప్రభాస్, నిధి అగర్వాల్‌పై ఈ పాటను చిత్రీకరించారు. విడుదలైన ప్రోమోలో ప్రభాస్ తనదైన రొమాంటిక్ లుక్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ 'రెబల్ సాబ్'కు మంచి స్పందన రాగా, ఇప్పుడు ఈ మెలోడీ ప్రోమోతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. పూర్తి పాటను డిసెంబర్ 17వ తేదీ సాయంత్రం 6:35 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ నటిస్తున్నారు. సంజయ్ దత్, బోమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని 2026 జనవరి 9న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



## అందాల 'భాగ్యం'

మిస్టర్ బచ్చన్ తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన భాగ్య శ్రీ బోర్స్ సక్సెస్ లు ఉన్నా లేకపోయినా సరే అమ్మడికి అవకాశాలు మాత్రం వరుసగా వస్తున్నాయి. మిస్టర్ బచ్చన్ తర్వాత కింగ్ డం వచ్చి నిరాశపరచింది. ఐతే రీసెంట్ గా అమ్మడు రెండు వారాల గ్యాప్ లోనే రెండు సినిమాలతో వచ్చింది. అందులో ఒకటి కాంత కాగా రెండోది ఆంధ్ర కింగ్ తాలూకా. ఈ సినిమాల కమర్షియల్ లెక్కలు ఎలా ఉన్నా రెండిటిలో భాగ్య శ్రీ గ్లామర్ తో పాటు యాక్టింగ్ కూడా ఇంప్రెస్ చేసింది. తనలోని నటిని పరిచయం చేసిన భాగ్య శ్రీకి మరిన్ని ఛాన్స్ లు వస్తున్నాయి. ఆల్రెడీ అమ్మడు మరో రెండు సినిమాల్లో డిక్షన్ లో ఉందని తెలుస్తుంది. ఐతే లేటెస్ట్ గా స్వప్న సినిమా బ్యానర్ లో నూతన దర్శకుడు చేస్తున్న ఒక ఫిమేల్ సెంట్రిక్ సినిమాలో హీరోయిన్ గా భాగ్య శ్రీ ఎంపికైందని తెలుస్తుంది. భాగ్య శ్రీకి ఇది నిజంగానే లక్కీ ఛాన్స్ అని చెప్పొచ్చు. ఎందుకంటే వైజయంతి బ్యానర్, స్వప్న సినిమాస్ లో సినిమా అంటే టాప్ క్లాస్ లెవెల్ లో ఉంటాయి. అందులోనూ లేడీ ఓరియెంటెడ్ సినిమా అంటే ఆ లెక్క వేరే ఉంటుంది. కెరీర్ ఎర్లీ స్టేజ్ లోనే భాగ్య శ్రీకి ఈ ఛాన్స్ నిజంగానే లక్కీ అని చెప్పొచ్చు. రమేష్ అనే నూతన దర్శకుడు ఈ సినిమాను కంప్లీట్ గా డిఫరెంట్ స్టోరీతో తెరకెక్కించే ప్లాన్ లో ఉన్నాడట. ఆంధ్రా కింగ్ తాలూకాతో ఆడియన్స్ ని ఇంప్రెస్ చేసిన భాగ్య శ్రీ ఈ సినిమాతో మరోసారి తన టాలెంట్ చూపించాలని చూస్తోంది.



## టాలీవుడ్‌లో యూనిటీ లేదు: తమన్

మ్యూజిక్ డైరెక్టర్ తమన్ రీసెంట్ గా చేసిన కామెంట్స్ సినీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారాయి. అనిరుధ్ కు తెలుగులో సినిమాలు ఈజీగా దొరుకుతున్నాయి కానీ తనకు తమిళ సినీ ఛాన్సులు రావడం మాత్రం కష్టమవుతుందని, దానికి కారణం తమిళ ఇండస్ట్రీలో యూనిటీ చాలా ఎక్కువని, ఆ యూనిటీ టాలీవుడ్ లో మిస్ అయిందని తాను అనుకుంటున్నానని తమన్ అన్నారు. తమన్ కోలీవుడ్ లో పెద్ద చర్చనీయాంశంగా మారాయి. అయితే తమన్ చెప్పిన మాట్లలో నిజం లేకపోలేదు. కోలీవుడ్ లో మంచి యూనిటీ ఉంది కాబట్టే అక్కడి సినిమాల్లో ఎక్కువగా నటీనటుల ఇస్తారు. కానీ టాలీవుడ్ లో అలా కాదు, అన్నీ భాషల వారికీ ఇక్కడ ఆదరణ దొరుకుతుంది. టాలెంట్ ఉన్న ఎవరినైనా టాలీవుడ్ ఎంకరేజ్ చేస్తుంది. కోలీవుడ్ లో యూనిటీ ఎక్కువ అని తమన్ ఇప్పుడు చెప్పిన మాటల్నే గతంలో కూడా పలువురు పలు సందర్భాల్లో ఇన్‌డైరెక్ట్ గా చెప్పారు.



## యుక్తి తరేజా హాట్ లుక్స్

యుక్తి తరేజా కొత్త లుక్ యూత్‌కి కిక్కిస్తోంది. హుషారుగా అలా బ్యాట్ ఝులిపిస్తూ టెన్నిస్ ఆడుతున్న ఫోజులు చూడగానే, ఎవరు ఈ టెన్నిస్ బంతుల పాప! అంటూ యూత్ లో ఎవరికి వారు ఆరాలు తీస్తున్నారు. యుక్తి రకరకాల భంగిమల్లో కెమెరాకు ఫోజులిచ్చింది. టెన్నిస్ ఆడే స్థలంలోనే రిలాక్స్ డ్ గా కూచుని ఫోజులిచ్చింది. ఇవన్నీ ఇప్పుడు నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. నిజానికి యుక్తి ఇప్పటివరకూ పెద్ద హీరోలతో నటించలేదు. నాగశౌర్య, కిరణ్ అబ్బవరం లాంటి యంగ్ ట్యాలెంట్ అవకాశాల్ని కల్పించారు. మునుముందు తన స్టార్ డమ్ ని పెంచుకునేందుకు యుక్తి ఎలాంటి ప్రణాళికల్ని సిద్ధం చేస్తుందో వేచి చూడాలి.

## ఆలోచించేలా.. ఇట్లు అర్జున!

'ఛలో', 'భీష్మ' లాంటి బ్లాక్ బస్టర్స్ ఇచ్చిన డైరెక్టర్ వెంకీ కుడుముల ఇప్పుడు నిర్మాతగా మారారు. 'వాట్ నెక్స్ట్ ఎంటర్టైన్మెంట్స్' బ్యానర్ పై ఆయన నిర్మిస్తున్న మొదటి సినిమా 'ఇట్లు అర్జున'. ఈ సినిమా ద్వారా అనీష్ అనే కొత్త కుర్రాడిని హీరోగా పరిచయం చేస్తున్నారు. విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది. సాధారణంగా మొదటి సినిమా అంటే కొత్త హీరోలు భారీ డైలాగులు, మాస్ ఎలివేషన్లు కోరుకుంటారు. కానీ ఇందులో హీరో అనీష్ ది చాలా ఛాలెంజింగ్ రోల్ అని గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. ఈ సినిమాలో హీరోకి మాటలు రాని మూగవాడు. కేవలం కళ్లతో, హావభావాలతోనే ఎమోషన్ పండించాలి. డెబ్యూ మూవీకే ఇలాంటి రిస్క్ తీసుకోవడం, సైలెన్స్ తోనే హీరోయిజం చూపించాలనుకోవడం నిజంగా సాహసమే. అయితే గ్లింప్స్ లో అనీష్ నటన చూస్తుంటే ఆ పాత్రకు న్యాయం చేసినట్లే కనిపిస్తోంది.



## ట్రెండింగ్‌లో సారా అర్జున్



నాన్న సినిమాతో బాలనటిగా గొప్ప పేరు తెచ్చుకుంది సారా అర్జున్. తమిళంలో ఈ చిత్రం దైవర్ తిరుమగళ్ పేరుతో విడుదలైంది. విక్రమ్ కుమార్తెగా క్యూట్ సారా నటనకు అభిమానులు ఫిదా అయ్యారు. అయితే సారా ఇప్పుడు అడల్ట్ ఏజ్ లో ప్రవేశించింది. కథానాయికగా కెరీర్ ని ప్రారంభించి తనదైన హవా సాగిస్తోంది. రణ్ వీర్ సింగ్ లాంటి సీనియర్ సరసన దురంధర్ లో సారా నటనకు గొప్ప గుర్తింపు దక్కింది. ఆ ఇద్దరికీ వయసు రీత్యా చాలా వ్యత్యాసం ఉన్నా, సారా తన అద్భుత నటనా నైపుణ్యంతో షో స్టాపర్ గా నిలిచింది. బాలీవుడ్ లో నేపో కిడ్స్ మధ్య అందాల సారా ప్రతిభతో దూసుకుపోవడం ఖాయంగా కనిపిస్తోంది. చాలా ప్లాస్టిక్ ముఖాల మధ్య సారా నిజమైన అందంతో కట్టి పడేయబోతోంది అంటూ ఫ్యాన్స్ వేనోళ్ల పొడుగుతున్నారు.





# గెలిపించిన బౌలర్లు

## టీమిండియా ఘన విజయం.. బుధవారం లక్నోలో నాలుగో టీ20

సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా పుంజుకుంది. రెండో టీ20 పరాజయం నుంచి త్వరగానే తేరుకున్న భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. ధర్మశాల వేదికగా ఆదివారం జరిగిన మూడో టీ20లో సమష్టిగా రాణించిన భారత్ 7 వికెట్ల తేడాతో సౌతాఫ్రికాను చిత్తు చేసింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 117 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్(46 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు. మిగతా బ్యాటర్లలో డోనవన్ ఫెర్రెయిరా(15 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 20), అన్రిచ్ నోర్జ్(12) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.



భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్(3/25), హర్షిత్ రాణా(2/34), వరుణ్ చక్రవర్తి(2/11), కుల్దీప్ యాదవ్(2/12) రెండేసి వికెట్లతో సత్తా చాటగా.. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేలకు చెరో వికెట్ దక్కింది. అనంతరం భారత్ 15.5 ఓవర్లలో 3 వికెట్లకు 120 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. అభిషేక్ శర్మ(18 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 35) తన జోరు కొనసాగించగా.. శుభ్‌మన్ గిల్(28 బంతుల్లో 5 ఫోర్లతో 28), సూర్యకుమార్ యాదవ్(11 బంతుల్లో 2 ఫోర్లతో 12) మరోసారి తడబడ్డారు. తిలక్ వర్మ(34 బంతుల్లో 3 ఫోర్లతో 26 నాటౌట్), శివమ్ దూబే(4 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 10 నాటౌట్) విజయలాంఛనాన్ని పూర్తి చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి, మార్కో జాన్సెన్, కార్బిన్ బోష్ తలో వికెట్ తీసారు. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 బుధవారం లక్నో వేదికగా జరగనుంది.

### మలుపు తిప్పిన హర్షిత్ రాణా, అభిషేక్ శర్మ

జస్‌ప్రీత్ బుమ్రా స్థానంలో తుది జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా అద్భుత బౌలింగ్‌తో సౌతాఫ్రికా పతనాన్ని శాసించాడు. నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసిన హర్షిత్ రానా 34 పరుగులిచ్చినా.. డేంజరస్ క్వింటన్ డికాక్, డేవాల్డ్ బ్రెవిస్‌లను ఔట్ చేసి మ్యాచ్‌ను భారత్‌వైపు మలుపు తిప్పాడు. అతనికి తోడుగా ఇతర బౌలర్లు కూడా చెలరేగడంతో మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. అతని దూకుడైన బ్యాటింగ్‌తో భారత్ విజయం సులువైంది. గిల్ తడబడినా.. అభిషేక్ విధ్వంసంతో భారత్ పవర్ ప్లేలోనే వికెట్ నష్టానికి 68 పరుగులు చేసింది. దాంతో తర్వాత వచ్చిన బ్యాటర్లు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు.



### చరిత్ర సృష్టించిన హార్దిక్ పాండ్యా!

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో 100 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. తద్వారా ఈ ఫీట్ సాధించిన తొలి భారత ఆల్‌రౌండర్‌గా చరిత్రకెక్కాడు. సౌతాఫ్రికాతో ధర్మశాల వేదికగా ఆదివారం జరిగిన మూడో టీ20లో ట్రిస్టన్ స్టబ్స్‌ను ఔట్ చేయడం ద్వారా హార్దిక్ పాండ్యా ఈ ఫీట్ సాధించాడు. ఈ ఘనతను అందుకున్న మూడో భారత పేసర్‌గా నిలిచాడు. అర్ష్‌దీప్ సింగ్(112), జస్‌ప్రీత్ బుమ్రా(101) హార్దిక్ పాండ్యా(100లి) కంటే ముందు ఈ ఫీట్ సాధించారు. అంతర్జాతీయ టీ20ల్లో 1000 ప్లస్ రన్స్‌తో పాటు 100 వికెట్లు పడగొట్టిన తొలి పేస్ ఆల్‌రౌండర్‌గా కూడా హార్దిక్ పాండ్యా చరిత్రకెక్కాడు. ఓవరాల్‌గా ఈ ఫీట్ సాధించిన మూడో బౌలర్‌గా నిలిచాడు. హార్దిక్ పాండ్యా కంటే ముందు స్పిన్ ఆల్‌రౌండర్లు అయిన షకీబ్ అల్ హసన్, మహమ్మద్ నబీ, సికిందర్ రాజా ఈ ఫీట్ సాధించారు. ఇప్పటి వరకు 123 మ్యాచ్‌లు ఆడిన హార్దిక్ పాండ్యా.. 26.81 సగటు, 8.24 ఎకానమీతో 100 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో 28.10 సగటు, 141.53 స్ట్రైక్‌రేట్‌తో 1939 పరుగులు చేశాడు.


**టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు**

**అర్ష్‌దీప్ సింగ్ (71 మ్యాచ్‌ల్లో 108 వికెట్లు)**
**జస్ప్రీత్ బుమ్రా(82 మ్యాచ్‌ల్లో 101 వికెట్లు)**
**హార్దిక్ పాండ్యా(123 మ్యాచ్‌ల్లో 100 వికెట్లు)**
**యుజ్వేంద్ర చాహల్(80 మ్యాచ్‌ల్లో 96 వికెట్లు)**
**భువనేశ్వర్ కుమార్(87 మ్యాచ్‌ల్లో 90 వికెట్లు)**

# హైదరాబాదీ భళా!

**పాక్‌పై భారత్ ఘన విజయం**

అండర్ 19 ఆసియా కప్ టోర్నీలో భారత్ జోరు కొనసాగుతోంది. పాకిస్థాన్‌తో ఆదివారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో ఆయుష్ మాత్రే సారథ్యంలోని భారత అండర్ 19 జట్టు 90 పరుగుల తేడాతో విజయం సాధించింది. హైదరాబాద్ బ్యాటర్ ఆరోన్ జార్జ్ అద్భుత బ్యాటింగ్‌తో పాటు దీపేష్ దేవంద్రన్(3/16), కాన్షిక్ చౌహన్(3/33) అసాధారణ బౌలింగ్ ప్రదర్శన టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్నందించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. విధ్వంసకర బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ(5) తీవ్రంగా నిరాశపర్చగా.. ఆరోన్ జార్జ్(88 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 85) హాఫ్ సెంచరీతో భారత్‌ను ఆదుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్లలో మహమ్మద్ సయ్యమ్, నిఖబ్ షఫీక్ మూడేసి వికెట్లు తీయగా.. నిఖబ్ షఫీక్ రెండు వికెట్లు పడగొట్టాడు. అలీరాజా, అహ్మద్ హుస్సేన్‌కు తలో వికెట్ దక్కింది. అనంతరం పాకిస్థాన్ 41.2 ఓవర్లలో 150 పరుగులకు ఆలౌటై ఓటమిపాలైంది. పాకిస్థాన్ అండర్ 19 బ్యాటర్లలో హుజైఫా అషన్(83 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 70) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో దీపేష్ దేవంద్రన్(3/16), కాన్షిక్ చౌహన్(3/33) మూడేసి వికెట్లు తీయగా.. కిషన్ సింగ్(2/33) రెండు వికెట్లు పడగొట్టాడు. ఖిలన్ పటేల్, వైభవ్ సూర్యవంశీ తలో వికెట్ తీసారు. ఈ విజయంతో గ్రూప్-ఏలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. మలేషియాతో మంగళవారం భారత్ తమ చివరి లీగ్



మ్యాచ్ ఆడనుంది.

**నిప్పులు చెరిగిన దీపేష్..**

లక్ష్యఛేదనలో పాకిస్థాన్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. భారత బౌలర్లు నిప్పులు చెరగడంతో పాక్ ఓపెనర్లు ఉస్మాన్ ఖాన్, సమీర్ మిన్హాస్ పూర్తిగా డిఫెన్స్‌కే పరిమితమయ్యారు. పరుగులు చేసేందుకు తీవ్రంగా తడబడ్డారు. చివరకు దీపేష్ అద్భుత బౌలింగ్‌తో సమీర్ మిన్హాస్(9) క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. పాక్ ఓపెనర్ల జిడ్డు బ్యాటింగ్‌తో పవర్ ప్లేలో ఆ జట్టు వికెట్ నష్టానికి 23 పరుగులే చేసింది. ఆ వెంటనే దీపేష్ వరుస ఓవర్లలో అలీ హసన్(0), అహ్మద్ హుస్సేన్(4)లను పెవిలియన్ చేర్చి కోలుకోలేని దెబ్బతీసాడు. జిడ్డుగా ఆడుతున్న ఉస్మాన్ ఖాన్(16)ను చౌహన్ క్యాచ్ ఔట్ చేయడంతో పాక్ 30 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

**దెబ్బతీసిన వైభవ్..**

ఈ పరిస్థితుల్లో కెప్టెన్ ఫర్హాన్ యూసఫ్(23), హుజైఫా అషన్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. 47 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని వైభవ్ సూర్యవంశీ విడదీసాడు. కెప్టెన్ ఫర్హాన్ యూసఫ్(23)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత వచ్చిన హంజా జహూర్(4), అబ్దుల్ సుభాన్(6) తీవ్రంగా నిరాశపర్చగా.. హాఫ్ సెంచరీ సాధించిన హుజైఫ్ అహ్సన్(70)ను చౌహన్ పెవిలియన్ చేర్చాడు. దాంతో పాక్ ఓటమి ఖాయమైంది. మహమ్మద్ సయ్యమ్, నిఖబ్ షఫీక్ కూడా ఔటవ్వడంతో పాక్ ఇన్నింగ్స్ ముగిసింది.



## ఫడ్నవీస్‌కు నిరసన సెగ

మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు చేదు అనుభవం ఎదురైంది. అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనల్ మెస్సీ ముందే ఫడ్నవీస్‌కు నిరసన సెగ తగిలింది. 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో భాగంగా ఆదివారం ముంబై నగరానికి వచ్చిన మెస్సీ.. వాంఖడే క్రికెట్ స్టేడియంలో సందడి చేశారు. ఈ కార్యక్రమానికి క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో పాటు దేవేంద్ర ఫడ్నవీస్ కూడా హాజరయ్యారు. భారత ఫుట్‌బాల్ దిగ్గజం సునీల్ ఛెత్రీ, సెలెబ్రిటీ టీమ్ మధ్య జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను వీక్షించిన మెస్సీ.. అనంతరం ముంబై అభిమానులకు అభివాదం చేశారు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో పాటు సునీల్ ఛెత్రీతో ఫొటోలకు ఫోజిచ్చారు. ఈ సందర్భంగా మెస్సీకి సచిన్ తన 2011 వరల్డ్ కప్ ఫైనల్ జెర్సీని బహుకరించాడు. మెస్సీ కూడా సాకర్ ప్రపంచకప్‌లో గోల్ కొట్టిన బంతిని సచిన్‌కు అందజేశాడు. ఒకే వేదికపై మెస్సీ, సచిన్, సునీల్ ఛెత్రీలను చూసిన అభిమానులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. అయితే ఈ కార్యక్రమం చివర్లో దేవేంద్ర ఫడ్నవీస్ మైక్ పట్టుకొని మాట్లాడుతుండగా.. అభిమానుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. క్రీడా ఈవెంట్‌లో ఫడ్నవీస్.. తమ ప్రభుత్వం చేపట్టబోతున్న 'ప్రాజెక్ట్ మహాదేవ్' గురించి మాట్లాడగా.. అభిమానులు పెద్ద ఎత్తున నిరసనను వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఫడ్నవీస్ ప్రకటించిన ప్రాజెక్ట్ మహాదేవ్ ప్రేక్షకుల్లోని కొందరికి నచ్చలేదు. దాంతో వారు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గ్రహించిన ఫడ్నవీస్ సమయస్ఫూర్తితో వ్యవహరించారు. వెంటనే గణపతి బప్పా అనే నినాదాలు ఇవ్వగా.. ప్రేక్షకులు మోర్య అని ప్రతిస్పందించారు. దాంతో అభిమానుల నిరసనలు ఆగిపోయాయి. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇప్పటికే కోల్‌కతా, హైదరాబాద్‌లో పర్యటించిన మెస్సీ.. ఆదివారం ముంబైలో సందడి చేశాడు. సోమవారం న్యూఢిల్లీలో పర్యటించనున్నాడు. అక్కడ అతను ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలవడంతో పాటు అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగే కార్యక్రమానికి హాజరవుతాడు. ఈ కార్యక్రమంతో మెస్సీ భారత పర్యటన ముగుస్తుంది.

## రోహిత్ నామస్మరణతో దద్దరిల్లిన వాంఖడే

రోహిత్ శర్మ నామస్మరణతో వాంఖడే స్టేడియం దద్దరిల్లింది. ముంబైకా రాజా రోహిత్ శర్మ అంటూ అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి రోహిత్ శర్మను ఎందుకు ఆహ్వానించలేదంటూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ మైదానంలో ఏర్పాటు చేసిన 7 వర్సెస్ 7 మ్యాచ్‌లో సునీల్ ఛెత్రీ తన బెంగళూరు ఎఫ్‌సీ ఆటగాళ్లతో కలిసి బరిలోకి దిగాడు. జిమ్ సరభ్, భారత మహిళల ఫుట్‌బాల్ కెప్టెన్ బాలా దేవీతో కూడిన సెలెబ్రిటీ టీమ్‌తో సునీల్ ఛెత్రీ టీమ్ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్‌లో సునీల్ ఛెత్రీ తొలి గోల్‌ను నమోదు చేశాడు. దురదృష్టవశాత్తు ఆట ప్రారంభంలోనే అతనికి కండరాలు పట్టేయడంతో మైదానంలో ఒక ప్రాంతానికే పరిమితమయ్యాడు. మెస్సీ ఎంట్రీతో ప్రేక్షకుల ఆనందం రెట్టింపు అయ్యింది. ఇంట మయామి సహచరులైన రోడ్రిగో డి పాల్, లూయిస్ సువారెజ్‌తో కలిసి మెస్సీ వాంఖడే మైదానంలోకి అడుగుపెట్టాడు. ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడుతున్న ప్లేయర్లతో మెస్సీ ముచ్చటించాడు. చివర్లో నిలిచిన భారత మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రీని మెస్సీ ఆలింగనం చేసుకోగానే అభిమానులు పెద్ద ఎత్తున అరిచారు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో రెండో అత్యధిక గోల్ స్కోరర్, నాలుగో అత్యధిక గోల్ స్కోరర్‌ను కలవడంతో భారత ఫుట్‌బాల్ అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు.

## సీఎస్కేకు ఇద్దరు చాలు: సంజయ్ బంగర్

ఐపీఎల్ 2026 మినీ వేలానికి రంగం సిద్దమైంది. మరో 48 గంటల్లో ఈ మినీ ఆక్షన్‌కు తెరలేవనుంది. మంగళవారం అబుదాబి వేదికగా ఐపీఎల్ 2026 మినీ వేలం జరగనుంది. ఇప్పటికే 10 ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్, రిలీజ్ జాబితాలను ప్రకటించి వేలానికి సిద్దమయ్యాయి. ఈ క్రమంలోనే ఆయా జట్లకు మాజీ క్రికెటర్లు పలు సూచనలు చేస్తున్నారు. తాజాగా చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) గురించి మాట్లాడిన టీమిండియా మాజీ క్రికెటర్, ఆర్‌సీబీ మాజీ హెడ్ కోచ్ సంజయ్ బంగర్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వేలానికి ముందే సీఎస్కే పటిష్టంగా ఉందని, ఆ జట్టు మరో ఇద్దర్నీ తీసుకుంటే సరిపోతుందని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ప్లే ఆఫ్స్ రేసు నుంచి తప్పుకోగానే.. తదుపరి సీజన్ కోసం జట్టును బలోపేతం చేయడంపై సీఎస్‌కే ఫోకస్ పెట్టింది. ఈ పనిని మెచ్చుకున్న బంగర్.. ఆయుష్ మాత్రే వంటి అప్‌కమింగ్ స్టార్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం జట్టుకు కలిసొచ్చే అంశమని తెలిపాడు. సీఎస్‌కే రూ.43.40 కోట్ల భారీ పర్స్ మనీతో మినీవేలం బరిలోకి దిగుతుంది. ఆ జట్టుకు నలుగురు విదేశీ ఆటగాళ్లతో పాటు మొత్తం 9 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
సోమవారం 15-12-2025 | www.evarthalu.com
నేటి ఈవార్తలు



# ఒక సిప్ చాయ్.. తాగరా భాయ్!

చాయ్ గొప్పదనం ఒక దేశానికో, ఒక సంస్కృతికో పరిమితం కాలేదు. ప్రపంచంలోని ప్రతి ఖండంలోనూ, చాయ్ స్థానిక రుచికి, ఆచారానికి అనుగుణంగా మారి, తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ప్రపంచంలోని ప్రతి ప్రాంతంలోనూ చాయ్ కొత్త రూపాన్ని ధరిస్తుంది. ఈ వైవిధ్యం చాయ్ అసాధారణమైన అనుకూలతను సూచిస్తుంది. చాయ్ రుచికి మాత్రమే కాదు, దాని ఆరోగ్య ప్రయోజనాలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది.

ప్రపంచం అత్యంత వేగంగా పరుగెడుతున్న ఈ యుగంలో, ఒక కప్పు చాయ్ అందించే ఐదు నిమిషాల ప్రశాంతత చాలా విలువైనది. ఇది మనల్ని మనం కోల్పోకుండా, వర్తమానంలో మనల్ని నిలబెడుతుంది. అది ఉప్పు కలిపిన వెన్న టీ అయినా, అల్లం ఘాటున్న మసాలా చాయ్ అయినా, లేదా సున్నితమైన గ్రీన్ టీ అయినా %-% ప్రతి కప్పు వెనుక ఒక కథ, ఒక సంస్కృతి, అన్నింటికీ మించి ప్రపంచ మానవాళిని ఏకం చేసే ఒక బలమైన శక్తి దాగి ఉంది. అందుకే, చాయ్ అనేది కేవలం పానీయం కాదు, అది మన ఆత్మ, మన సంస్కృతి, మన సార్వత్రిక జీవన స్రవంతి. తేయాకులో సహజంగా ఉండే ఫ్లేవనాయిడ్లు కేటెచిన్స్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో హానికరమైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, కణాల నష్టాన్ని నివారిస్తాయి. అందుకే టీ తాగేవారిలో కొన్ని దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తక్కువగా ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. చాయ్‌లో ఉన్న కొద్దిపాటి కెఫిన్ మెదడుకు ఉత్తేజాన్ని ఇచ్చి, చురుకుదనాన్ని పెంచుతుంది. అదే సమయంలో, ఇందులో ఉండే ఎల్-థియానైన్ అనే అమైనో ఆమ్లం ఒత్తిడిని తగ్గిస్తుంది, ఏకాగ్రతను పెంచుతుంది. ఇది ఒకేసారి ఉత్తేజాన్ని, ప్రశాంతతను ఇచ్చే అరుదైన పానీయం. మసాలా చాయ్‌లో వాడే అల్లం, యాలుకలు వంటి మసాలాలు సహజంగానే యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ యాంటీ-మైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంటాయి, ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి, సాధారణ జలుబు వంటి వాటి నుంచి ఉపశమనం అందించడానికి సహాయపడతాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చాయ్ ఒక ప్రధాన వాణిజ్య వస్తువుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. దాని ఆర్థిక ప్రభావం ప్రపంచంలోని లక్షలాది మంది ప్రజల జీవితాలపై ఆధారపడి ఉంది.

చాయ్ అనేది వ్యవసాయం నుంచి తుది వినియోగదారుడి వరకు విస్తృతమైన ఆర్థిక గొలుసును కలిగి ఉంది. భారతదేశం, శ్రీలంక, కెన్యా, చైనా వంటి ప్రధాన టీ ఉత్పత్తి దేశాలలో, లక్షలాది మంది ప్రజలు తేయాకు తోటలపై ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా టీ తోటలలోని మహిళా కార్మికులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కష్టపడి పనిచేసే శ్రమశక్తిలో ఒకరు. వారి ఆదాయం వారి కుటుంబాలను పోషించడానికి, పిల్లలకు విద్య అందించడానికి కీలకంగా ఉంటుంది. కాఫీ, చమురు తర్వాత ప్రపంచంలో అత్యధికంగా వాణిజ్యం జరిగే వస్తువుల్లో టీ ఒకటి.

దీని ఎగుమతి, దిగుమతులు అంతర్జాతీయ సంబంధాలను, ఆర్థిక లావాదేవీలను ప్రభావితం చేస్తాయి. కెన్యా వంటి దేశాలకు టీ ఎగుమతులు ప్రధాన విదేశీ మారక ద్రవ్యాన్ని అందిస్తాయి. భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో ఉన్న వేలాది చాయ్ వాలాలు (టీ స్టాల్ యజమానులు) చిన్న వ్యాపార వ్యవస్థకు మూలస్తంభం. వీరు రోజుకు కొన్ని వందల కప్పుల చాయ్‌ను అమ్ముతూ, వేలాది మందికి తాత్కాలిక విశ్రాంతిని, శక్తిని అందిస్తారు. చిన్న మొత్తంలో వ్యాపారం చేసి, పెద్ద వ్యవస్థకు సపోర్ట్ ఇచ్చే ఈ 'టీ ఎకానమీ' ప్రపంచంలోనే ప్రత్యేకమైనది. ప్రస్తుతం ఆర్గానిక్ టీలు, తెల్లటి టీ, ఊలాంగ్ టీ వంటి ప్రీమియం టీలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. ప్రజలు ఇప్పుడు టీని కేవలం పానీయంగా కాకుండా, ఒక రుచిని ఆస్వాదించే అనుభూతిగా చూస్తున్నారు. బాటిల్డ్ ఐస్డ్ టీ, బబుల్ టీ, టీ ఎనర్జీ డ్రింక్స్ వంటి కొత్త రూపాలు ముఖ్యంగా యువతను ఆకర్షిస్తున్నాయి. బబుల్ టీ (లేదా బోబా టీ) తైవాన్‌లో పుట్టి, ఇప్పుడు ఆసియా, ఐరోపా, అమెరికా అంతటా ఒక ట్రెండ్‌గా మారింది, టీ సంస్కృతిని మరింత విస్తృతం చేసింది. టీ పరిశ్రమలో పర్యావరణ సుస్థిరత కార్మికుల సంక్షేమంపై దృష్టి పెరిగి, ఫెయిర్ ట్రేడ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్లు వంటివి ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. టీ కప్పు అనేది చరిత్ర, సంస్కృతి, వాణిజ్యం మానవ సంబంధాలను ఒకచోట చేర్చే ఒక అద్భుతమైన పాత్ర. చైనా పురాతన ఔషధం నుంచి, టర్కీ బలమైన సామాజిక చిహ్నం వరకు, బ్రిటన్ సాంఘిక వేడుక నుంచి, భారతదేశంలోని ప్రతి ఇంట్లో ప్రతి ఉదయపు ప్రారంభం వరకు %-% చాయ్ ప్రపంచంలోని ప్రతి మనిషికి ఏదో ఒక విధంగా అనుసంధానమై ఉంది.

## ప్రీమియం టీలు

**బ్రిటిష్ టీ:** ఇక్కడ చాయ్ ఒక సాంఘిక వేడుక. కచ్చితంగా సాయంత్రం 4 గంటలకు పాలు, కొద్దిపాటి చక్కెర కలిపిన 'ఎర్ల్ గ్రే' లేదా 'అస్సాం టీ'ని స్కోన్స్, శాండ్‌విచ్‌లతో పాటు తీసుకోవడం వారి సంప్రదాయం. ఈ ఆచారం సామ్రాజ్య పాలనలో మొదలై, బ్రిటన్ జాతీయ చిహ్నాలలో ఒకటిగా మారింది.

**జపాన్ – మచ్చా :** జపాన్‌లో టీ కేవలం పానీయం కాదు, అది ఒక ఆధ్యాత్మిక ప్రక్రియ. మచ్చా అనేది టీ ఆకులను మెత్తగా పొడి చేసి, వేడి నీటిలో కలిపి తయారుచేసే పానీయం. . జపనీస్ టీ సెరిమనీ (చానోయు) అనేది సంప్రదాయం, గౌరవం మనశ్శాంతిని సూచించే ఒక క్లిష్టమైన కళారూపం.

**టర్కీ – రిజ్ టే:** ప్రపంచంలో తలసరి టీ వినియోగంలో టర్కీ అగ్రస్థానంలో ఉంది. వారు టీని చాలా గాఢంగా (డార్క్, బ్లాక్) రెండు వేర్వేరు కెటిల్స్‌లో (చాయ్‌డాన్‌ల) తయారుచేసి, 'తులిప్' ఆకారపు చిన్న గ్లాసులలో ఆస్వాదిస్తారు. టర్కీలో టీ అనేది స్నేహానికి, పొరుగు సంబంధాలకు కేంద్ర బిందువు.

**టిబెట్ – బో చా :** టిబెటన్లలో చలి నుంచి రక్షణ కోసం, తేయాకును యాక్ వెన్న ఉప్పుతో కలిపి తయారుచేస్తారు. ఈ వెన్న టీ వారి ఎత్తైన, అతిశీతల ప్రాంతంలో జీవించడానికి కావలసిన శక్తిని, కొవ్వును అందిస్తుంది.



నేడు బాపు జయంతి

# బాపు బొమ్మ.. సున్నితత్వం.. తెలుగుదనం

తెలుగు చిత్రకళ, సినీ జగత్తులలో ఒక ధ్రువతారగా వెలిగిన బాపు (సత్తిరాజు లక్ష్మీనారాయణ) జీవితం, కళాత్మకతకు, సంస్కృతికి అంకితమైన ఒక అద్భుతమైన ప్రయాణం. ఆయన కేవలం ఒక చిత్రకారుడు, దర్శకుడు మాత్రమే కాదుబీ తెలుగువారి సంస్కృతి, మనస్తత్వాలను తన రేఖల ద్వారా, దృశ్యాల ద్వారా ఆవిష్కరించిన గొప్ప బహుముఖ ప్రజ్ఞాశాలి. 1933 డిసెంబర్ 15న ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో జన్మించిన బాపు, న్యాయశాస్త్రంలో పట్టా పొందినా, ఆయన జీవిత గమనాన్ని మార్చింది మాత్రం చిత్రకళే.

**1945లోనే** 'ఆంధ్ర పత్రిక'లో వ్యంగ్య చిత్రకారుడిగా ఆయన ప్రస్థానం మొదలైంది. బాపు గీత ప్రత్యేకత %-% సరళత, సున్నితత్వం, తెలుగుదనం. ఆయన వేసిన స్త్రీల రూపాలు (ముఖ్యంగా 'కామాక్షులు' అని పిలువబడే పెద్ద కళ్ళ అమ్మాయిలు), పౌరాణిక పాత్రలు, దైనందిన జీవిత సన్నివేశాలు... అన్నీ తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయాయి. తెలుగు అక్షరాలకు కూడా ఒక ప్రత్యేకమైన శైలిని, అందాన్ని తీసుకొచ్చింది బాపు గారి చేతిరాత. అది తెలుగు పత్రికల్లో, పుస్తకాల ముఖచిత్రాలపై ఒక ట్రెండ్‌గా మారింది. చిన్ననాటి స్నేహితుడు, ప్రముఖ రచయిత ముళ్ళపూడి వెంకటరమణ (రమణ)తో ఆయన అనుబంధం తెలుగు కళా చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం. రమణ గారి మాట, బాపు గారి గీత కలసి 'బుడుగు' వంటి హాస్యాన్ని, 'కోతి కొమ్మచ్చి' వంటి జీవితానుభవాలను అందించాయి. చిత్రకళా రంగంలో అగ్రస్థానం సంపాదించిన బాపు, తన కళాదృష్టిని సినిమా రంగంలోకి కూడా తీసుకొచ్చారు. 1967లో 'సాక్షి' చిత్రంతో దర్శకుడిగా అడుగుపెట్టారు. రమణ కథ, సంభాషణలు, బాపు దర్శకత్వం కలసి అనేక అపురూప చిత్రాలను సృష్టించాయి. 'ముత్యాల ముగ్గు', 'మనుషులు మారాలి', 'గోరంత దీపం', 'తూర్పు వెళ్లే రైలు', 'శ్రీరామరాజ్యం' వంటి చిత్రాలు ఆయన దర్శకత్వ ప్రతిభకు నిదర్శనం. ఆయన సినిమాల్లో కథనం, పాత్రల తీరు, గోదావరి అందాలు, సంగీతం ఒక ప్రత్యేకమైన కవిత్వాన్ని కలిగి ఉంటాయి. ఆయన హిందీలో కూడా 'హమ్ పాంచ్' వంటి విజయవంతమైన చిత్రాలను రూపొందించారు. బాపు గారు తన సుదీర్ఘ కెరీర్‌లో అనేక అవార్డులు, గౌరవాలు అందుకున్నారు. వాటిలో 5 నంది అవార్డులు, 2 జాతీయ పురస్కారాలు ఉన్నాయి. కళారంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా 2013లో భారత ప్రభుత్వం ఆయనకు ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డును ప్రదానం చేసింది. బాపు 2014 ఆగష్టు 31న తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన గీసిన ప్రతి రేఖ, ఆయన తెరకెక్కించిన ప్రతి దృశ్యం తెలుగు కళాభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. బాపు కేవలం చిత్రకారుడు, దర్శకుడు కాదు %-% తెలుగుదనం అనే భావనకు ఒక దృశ్యరూపం. బాపు గారి చిత్రకళా శైలి అత్యంత విలక్షణమైనది. ఆయన బొమ్మలను వేరే ఏ చిత్రకారుడితో పోల్చలేం. బాపు బొమ్మల్లో సంక్లిష్టత ఉండదు. కేవలం కొన్ని సరళమైన రేఖలతోనే ఆయన అద్భుతమైన భావాలను, రూపాలను సృష్టించేవారు. ఈ సరళతే ఆయన గీతకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. సంక్షిప్తంగా చెప్పాలంటే, బాపు గారి కళా వారసత్వం కేవలం బొమ్మలు లేదా సినిమాలతో ముడిపడి లేదుబీ అది తెలుగుతనం అనే భావనకు ఒక ఆత్మను పోసింది.



**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.